నిర్భయవార్త

సంపాదకీయం

గురువారం 10 సెప్టెంబర్ 2026

# అరణ్య రోదన కారాదు!

'జల్–జంగిల్–జమీన్' ఒక నినాదం కాదు... ఆదివాసీల మనుగడకు మూలాధారం. అడవుల్లో ఉన్న అత్యంత విలువైన ఖనిజాలను, వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు గిరిజనుల హక్కులను కాలరాసే చర్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటుండటం దుర్మార్గం. నేటికీ ప్రాథమిక సౌకర్యాలు కూడా లేని ప్రాంతాల్లో దుర్భర జీవితాన్ని గడువుతూ, నిత్యం దోపిడీకి గురవుతూ, వ్యాధులు, ఇతర కారణాలతో ప్రాణాలు కోల్పోతున్న ఆదివాసీల రక్ష?ణ ప్రభుత్వాల బాధ్యత.'భూమి, అడవులు మావే... అదానీ, అంబానీలవి కావు' అంటూ ఢిల్లీ వేదికగా నినదించిన మన్యం బిడ్డల గోడును పట్టించుకోకపోతే వారి మనుగడకే కాదు... ప్రకృతి, సమస్త మానవాళి మనుగడకూ వినాశనమే. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్ఎం) ఆధ్వర్యాన హస్తినలో సాగిన ఆదివాసీల భారీ ధర్నా, ప్రదర్శన, జాతీయ సదస్సు లేవనెత్తిన డిమాండ్లు ఎంతో సహేతుకమైనవి. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్‌లో పొందుపరిచిన హక్కులు, అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఎ), పంచాయతీలకు విస్తరించిన షెడ్యూల్డ్ ప్రాంతాల చట్టం (పీసా), 1/70 తదితర చట్టాలు అమలులో ఉన్నప్పటికీ ఆదివాసీలకు భూమి, అడవులు, సహజ వనరులపై హక్కులు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి లోకూర్ వ్యాఖ్యలు అక్ష?ర సత్యం. ఆ చట్టాలను నిర్వీర్యం చేసే దుర్మార్గపు ప్రతిపాదనలను కేంద్రంలోని మోడీ సర్కారు ముందుకు తీసుకురావడం మరింత ఆందోళనకరం. గ్రామ సభల అధికారాలను పక్కనపెట్టి ఖనిజ వనరుల పేరుతో ఆదివాసీలను తరిమివేయడం, మణిపూర్‌లాంటి ప్రాంతాల్లో జాతి హింస పెచ్చరిల్లేలా కుట్రలు పన్నడం వారి హక్కులను హరించడమే.ప్రకృతితో మమేకమైన విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు, ప్రత్యేకమైన భాషలకు ఆదివాసీలు వారసులు. బ్రాహ్మణీయ సంస్కృతిని ప్రవేశపెట్టి వారి వారసత్వ సంపదకు విఘాతం కలిగిస్తూ, మతాల పేరుతో వైషమ్యాలు, మారణహోమాలు సృష్టిస్తున్న సంఘ్‌పరివార్ చర్యలను తిప్పికొట్టేలా ఆదివాసీలను చైతన్యపరచాల్సిన బాధ్యత అందరిదీ. కార్పొరేట్, ప్రైవేట్ రంగం విస్తరించడంతో వారి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రోజురోజుకూ కుంచించుకుపోతున్నాయి.ఏళ్లతరబడి మలేరియా మన్యం బిడ్డల ఉసురు తీస్తూనే ఉండటం నిర్లక్ష్యపు ఏలుబడికి నిలువుటద్దం. పోలవరం జిల్లా చింతూరు సబ్ డివిజన్ పరిధిలో వారం రోజుల వ్యవధిలోనే విద్యార్థినులు పద్దం రోజా (9), మాడివి జమున (7), జాహ్నవి (13) ప్రాణాలు కోల్పోవడం సిగ్గుచేటు. మెయిన్ రోడ్డుకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండి, రహదారి సౌకర్యం కూడా లేని గొల్లగుప్పకు చెందిన రోజా ఆగస్టు చివరి వారంలో ప్రాణాలు కోల్పోయింది. అక్కడ వైద్య శిబిరంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ, కేంద్రం నిషేధించిన క్లోరోక్విన్ మాత్రలను పంపిణీ చేయడం ఏడేళ్ల జమున మరణంతోపాటు మరో 52 మంది అస్వస్థతకు దారితీయడం విషాదం. కోతులగుట్ట ఎపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న కూనవరం మండలం పల్లూరి విద్యార్థిని తెల్లం జాహ్నవి సరైన వైద్యం అందక మరణించడం మరో ఘోరం. ఈ ఘటనలను కప్పిపుచ్చుకునేందుకు అర్ధరాత్రి హడావిడిగా పోస్టుమార్టం నిర్వహించడం, డెత్ సర్టిఫికెట్లు తారుమారు చేయడం, బాధిత కుటుంబాలను పరామర్శించడానికి గొల్లగుప్ప గ్రామానికి గిరిజనసంఘం, సిపిఎం నాయకులు వెళ్లకుండా అడ్డుకోవడం బరితెగింపే. నేటికీ కలెక్టర్, ఐటిడిఎ పిఒలు ఆ గ్రామాన్ని సందర్శించకపోవడం బాధ్యతారాహిత్యమే. 'అడవి బాట' అంటూ హడావిడి చేసే ఉప ముఖ్యమంత్రి ఆ గ్రామాన్ని సందర్శిస్తే ప్రభుత్వ పనితీరు అర్థమవుతుంది. మృతుల కుటుంబాలకు రూ.25 లక్ష?ల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి. గిరిజన ప్రాంతాల్లో మలేరియా, ఇతర వ్యాధులతో మరణిస్తున్న వారి కుటుంబాలను ఆదుకోవాలి. వెంటనే స్పందించి మలేరియా నివారణకు ప్రతి గిరిజన గ్రామంలో శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత. గిరిజనాన్ని చెట్టుకొకరు పుట్టకొకరుగా తరిమేసే ప్రమాదకరమైన ది మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) అమెండ్‌మెంట్ బిల్లు 2026ను కేంద్రం ఉపసంహరించుకోవాలి. ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతోపాటు ఆదివాసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు కల్పించడం, విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌లను పెంచడం ప్రభుత్వాల బాధ్యత. మన్యం బిడ్డల ఆవేదన అరణ్య రోదనగా మారితే నష్టపోయేది సమాజమే.

# పలు దేశాల్లో డేటా సెంటర్లకు పెరుగుతున్న వ్యతిరేకత




స్వతంత్ర, సమగ్ర పర్యావరణ, సామాజిక ప్రభావ అధ్యయనాలు జరిపి బహిర్గతం చేసేంత వరకు ఎ.ఐ డేటా సెంటర్లకు అనుమతి ఇవ్వరాదని, ఇచ్చిన వాటిని అధ్యయనాలు చేసేంతవరకు నిలిపివేయాలంటూ విశాఖపట్నంలో సెప్టెంబరు ఆరున జరిగిన జాతీయ సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు." విశాఖపట్నం ప్రకటన'' ను ఆమోదించారు. ఇదే సమయంలో హైదరాబాద్‌లో నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీలో దేశంలో అతి పెద్ద ఎ.ఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. వర్తమానంలో ఆర్థిక, సమాచార వ్యవస్థలలో డేటా (సమాచారం) ఎంతో కీలకంగా మారింది. అయితే ఏదైనాసరే కొత్త సమస్యలను సృష్టించకూడదన్నది పారిశ్రామిక విప్లవం నేర్పిన ఒక పెద్ద పాఠం. ఇటీవలి కాలంలో కాలుష్య కారక ఫ్యాక్టరీలు, ఉత్పత్తులతో పాటు డేటా సెంటర్లు కూడా పర్యావరణ సమస్యలను ముందుకు తెస్తున్నాయి. దాంతో వాటికి వ్యతిరేకంగా ఆందోళనలు ప్రారంభమయ్యాయి. టిడిపి కూటమి సర్కార్ విశాఖ జిల్లాలో ఏర్పాటు చేయిస్తున్న గూగుల్ డేటా సెంటర్‌తో తలెత్తే పర్యావరణ ముప్పు మీద ఎలాంటి నివేదికలు లేకుండా దొడ్డిదారిన దానికి అనుమతి ఇచ్చారు. అమెరికాను వదలి మన దేశానికి రావటం పెద్ద గొప్పగా ప్రచారం చేస్తున్నారు. అసలు సంగతేమిటంటే అక్కడ ఇలాంటి కేంద్రాల ఏర్పాటుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలతో ఇక్కడకు వస్తున్నాయి తప్ప మన మీద ప్రేమ కాదు.డేటా సెంటర్ల భూమితో పాటు ఆ కేంద్రాలను చల్లబరిచేందుకు భారీ మొత్తంలో నీరు, విద్యుత్ అవసరం. గాలిలో కాలుష్యాన్ని పెంచుతాయి. వాతావరణం వేడెక్కుతుంది. అందుకే సమీపాల్లో నివశించేందుకు అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారు. కార్పొరేట్ కంపెనీలు అవసరమైన అనుమతుల కోసం స్థానిక, రాష్ట్ర, ఫెడరల్ ప్రభుత్వాల్లో ఉన్న పెద్దలకు భారీ ఎత్తున ముడుపులు అందచేస్తున్నట్లు ఫుడ్ అండ్ వాటర్ వాచ్ (ఆహారం మరియు నీటిపై నిఘా) సంస్థ రాజకీయ డిప్యూటీ డైరెక్టర్ థామస్ మేయర్ చెప్పారు.డేటా సెంటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ అమెరికాలో వందలాది సంస్థలతో " డేటా సెంటర్ల నిలిపివేత కూటమి " ఏర్పాటైంది. పర్యావరణ రక్షణ అంశంలో లోపభూయిష్టంగా ఉన్న అమెరికా ఎ.ఐ చట్టాన్ని రక్షించాలంటూ డోనాల్డ్ ట్రంప్ మద్దతుతో కార్పొరేట్ సంస్థలు చేసిన యత్నాన్ని పర్యావరణ పరిరక్షణ సంస్థలు వమ్ము చేశాయి. అంతటితో ఆగకుండా ఇప్పుడు రాష్ట్ర, స్థానిక స్థాయిలో ఆందోళన చేస్తున్నారు. దీంతో కొన్ని రాష్ట్రాల్లోని చట్టసభల సభ్యులు డేటా సెంటర్ల ఏర్పాటును వాయిదా వేయాలని తీర్మానాలు ప్రతిపాదిస్తున్నారు. డేటా సెంటర్లు వద్దని దేశంలో తొలిసారి తీర్మానం చేసిన రాష్ట్రంగా న్యూయార్క్ చరిత్రకెక్కింది. ఆందోళనలు ఉధృతంగాక ముందే సెంటర్ల ఏర్పాటుకు కంపెనీలు పరుగులు తీస్తున్నాయి. పెన్సిల్వేనియా రాష్ట్రంలో వీటి ఏర్పాటుతో తలెత్తిన సమస్యలను గుర్తించారు. వీటి నిర్మాణానికి భారీ యంత్రాల వినియోగంతో ధ్వని కాలుష్యం పెరిగింది. డీజిల్ జనరేటర్లతో వేడి పెరుగుతున్నది. ఎయిర్ కండిషనర్లు నిరంతరం రొద పెడుతున్నాయి. అక్కడ వెలువడే ధ్వని వినికిడి మీద ప్రభావం చూపుతున్నది. ఈ కేంద్రాలలో రాత్రంతా వెలుగు ఉండటంతో పరిసరాల జనాల్లో నిద్ర, లేచే సమయాల్లో తేడాలు వచ్చి సమస్యలు తలెత్తుతున్నాయి. దీన్ని వెలుగు కాలుష్యం అంటున్నారు. కొన్ని కేంద్రాలు గ్యాస్‌తో నడుస్తూ కాలుష్యాలను విడుదల చేస్తున్నాయి. ఒక అధ్యయనం ప్రకారం అమెరికాలోని మొత్తం డేటా సెంటర్ల కారణంగా 2030 నాటికి ఆరు లక్షల మందిలో ఆస్మా లక్షణాలు కనిపిస్తాయని, 1300 మంది ముందుగానే చనిపోతారని, ఏటా ఆస్మాతో మరణిస్తున్నవారి కంటే మూడో వంతు మరణాలు పెరుగుతాయని, ప్రజారోగ్య రక్షణకు ఏటా అదనంగా 20 బిలియన్ డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని తేలింది.డేటా కేంద్రాలకు పెద్ద మొత్తంలో విద్యుత్ అవసరం, వాటికోసం సరఫరా వ్యవస్థల నిర్మాణానికి ఖర్చు తడచి మోపెడంత అవుతుంది. ఆ మొత్తాన్ని దామాషా ప్రకారం అయినా గృహ వినియోగదారుల మీద కూడా మోపుతారు. అది వారి మీద అదనపు బాదుడే. ఈ విధంగా పెన్సిల్వేనియా రాష్ట్రంలో 20 శాతం రేట్లు పెరిగాయి. అంటే కార్పొరేట్ల లాభాల కోసం సాధారణ పౌరులు అదనపు భారం మోయాలి. పౌరుల నుంచి వ్యతిరేకత రావటంతో డేటా సెంటర్లు తమకు అవసరమైన విద్యుత్‌ను తామే ఉత్పత్తి చేసుకోవాలి లేదా స్థానికుల మీద భారం పడకుండా అదనపు చార్జీలు చెల్లించాలని రాష్ట్ర గవర్నర్ ప్రకటించాల్సి వచ్చింది. డేటా సెంటర్లు వద్దనే ఆందోళన ఒక్క అమెరికాకే పరిమితం కాలేదు. నెదర్లాండ్స్‌లోని జీవుల్డే అనే చిన్న పట్టణ ప్రజలకు డేటా సెంటర్ల వ్యతిరేక ఆందోళన గురించి 2021వరకు తెలియదు. అక్కడ మెటా 410 ఎకరాల ప్రభుత్వ భూమిలో 200 మెగావాట్ల కేంద్రాన్ని ప్రతిపాదించింది. ఆ పట్టణం మొత్తం వినియోగించే విద్యుత్‌కు రెండు రెట్లు ఈ కేంద్రానికి అవసరమని తేలింది. దీంతో అక్కడి జనాలు దాన్ని వ్యతిరేకించారు. మున్సిపాలిటీ ఆమోదించింది. చివరి వరకు అసలా కంపెనీని ఎవరు ఏర్పాటు చేస్తున్నారో కూడా తెలియకుండా చూశారు అధికారులు. అయితే నెదర్లాండ్స్ ప్రభుత్వమే డేటా సెంటర్లు 70 మెగావాట్లకు మించి పెట్టరాదని నిర్ణయించటంతో మెటా కేంద్రం రద్దయింది. తరువాత జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో డేటా సెంటర్‌ను వ్యతిరేకించిన వారే గెలిచారు. ఐర్లండ్‌లో వ్యతిరేకత కారణంగా యాపిల్ కంపెనీ ఒక బిలియన్ డాలర్ల ప్రాజెక్టును రద్దు చేసుకుంది. జనాల అభ్యంతరాలను సుప్రీంకోర్టు సమర్థించింది. అయితే అక్కడి డేటా సెంటర్ల వివరాలను చూస్తే పదేళ్ల క్రితం దేశం మొత్తం వినియోగించే విద్యుత్‌లో కేవలం ఐదు శాతమే వినియోగించగా గతేడాది 23 శాతానికి చేరింది. 2034 నాటికి 31శాతం కానుంది. అడ్డగోలుగా కార్పొరేట్ సంస్థలకు దాసోహమనే రాజకీయ నేతలు పాలకులుగా ఉన్నపుడు వాటిని అడ్డుకోవటం చాలా కష్టంతో కూడుకున్న వ్యవహారం. చిలీలో గూగుల్ సంస్థ ఏర్పాటు చేయతలపెట్టిన కేంద్రంతో పర్యావరణ ప్రభావం గురించి తగిన నివేదిక ఇవ్వకపోవటంతో కోర్టు అడ్డుకున్నది. అదే గూగుల్ మరోచోట ఏర్పాటు చేయాలని చూసినప్పుడు దానిని జనం అడ్డుకున్నారు. ధనిక దేశాల వారు వినోదం కోసం ఎ.ఐ చిత్రాలను రూపొందించేందుకు మా నీటిని ఫణంగా పెట్టి డేటా కేంద్రాల నిర్మాణం అవసరం లేదని చిలీ నీటి హక్కుల సంస్థ ప్రతినిధి టానియా రోడ్రిగజ్ స్పష్టం చేశారు. ఉరుగ్వేలో గూగుల్ తలపెట్టిన కేంద్రానికి 20 లక్షల గాలన్ల నీరు కావాలని తేలటంతో జనం వ్యతిరేకించారు. చివరకు చల్లబరిచేందుకు నీటిని వాడబోమంటూ చిన్న కేంద్రానికి పరిమితం కావాల్సి వచ్చింది. ఆస్ట్రేలియా మరికొన్ని దేశాల్లో కూడా డేటా సెంటర్లకు వ్యతిరేకత పెరుగుతున్నది.డేటా సెంటర్లకు సంబంధించి కొన్ని అవాస్తవాలు–నిజాల గురించి చూద్దాం. అమెరికా అనుభవాన్ని పరిశీలించినట్లయితే నిర్మాణ సమయంలో ఉపాధి తప్ప పర్మనెంటు ఉద్యోగాలు అంతంతమాత్రమే. ఒక పెద్ద కేంద్రంలో కేవలం 50 నుంచి 150 మందికి లభిస్తాయి. అవి కూడా భద్రతా సిబ్బంది, నిపుణులైన సాంకేతిక నిపుణులకే పరిమితం. అదనపు పెట్టుబడులు, అనుబంధ పరిశ్రమలు, ప్రభుత్వాలకు అదనపు వన్నులూ రావు. ప్రజల సొమ్మును వాటికి ఖర్చు చేస్తారు. స్థానిక వ్యాపారులకు ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. జార్జియా రాష్ట్రంలో 70 శాతం కేంద్రాలకు ఎలాంటి సబ్సిడీలు ఇవ్వలేదు. ఈ కేంద్రాలను చల్లబరిచేందుకు ఉపయోగించే నీటిని తిరిగి విడుదల చేసినపుడు అవి వేడిగా ఉంటాయి. నీటి వనరులు, పర్యావరణాన్ని ప్రభావితం చేసే కొత్త సమస్యలను సృష్టిస్తాయి. చైనాలో కూడా పెద్ద సంఖ్యలో డేటా సెంటర్లు ఉన్నాయి కదా వాటి సంగతేమిటని ఎవరైనా ప్రశ్నించవచ్చు. ఎక్కడైనా సమస్యలు ఒకటే. అందుకే చైనా సముద్రాల్లో 35 మీటర్లలోతులో తేలియాడే వాటిని ఏర్పాటు చేసి నష్ట నివారణ చర్యలు తీసుకుంటున్నారు. ఒత్తిడిని తట్టుకొనే ఉక్కును తయారు చేస్తున్నారు. షాంఘై తీరంలో రెండు వేల సర్వర్లు ఉన్న కేంద్రాన్ని 115 అడుగుల లోతులో ఏర్పాటు చేశారు. ఇలాంటి ఏర్పాట్ల వలన 90 శాతం ఇంధనం ఆదా అవుతుంది. అవసరమైన విద్యుత్‌లో 97 శాతం సమీపంలోని ఉపరితల గాలి మరల ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు. ఇతర దేశాల్లో కూడా ఇలాంటి ప్రయోగాలు జరిగాయిగానీ వాణిజ్య అవసరాలకు ఏర్పాటు చేయటం లేదు. బ్రిటన్‌లో మైక్రోసాఫ్ట్ జరిపిన ప్రయోగంలో భూమి మీద ఏర్పాటు చేసిన వాటి కంటే నీటిలో వాటి వైఫల్యాలు తక్కువగా ఉన్నట్లు తేలింది. అయినా వాణిజ్యపరంగా ముందుకు పోలేదు. ఉపాధి పేరుతో చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి వంటి పాలకులు కార్పొరేట్లకు భారీ మొత్తాల్లో అప్పనంగా సబ్సిడీలు ఇస్తున్నపుడు వాటిని ఎందుకు వదులుకుంటారు

**ఎం. కోటేశ్వరరావు**

# జనగణన - ఒక పరిశీలన

2021 జనాభా లెక్కల కోసం సుమారుగా 2018 లేదా 2019లో మొదలు కావలసిన ప్రక్రియ 2026 ఏప్రిల్ లో మొదలైంది. దీనిని రెండు దశలలో నిర్వహించాలని నిర్ణయించారు. మొదటి దశలో 'గృహ వసతికి' సంబంధించిన వివరాల సేకరణ ఏప్రిల్ 1 నుండి మొదలయి సెప్టెంబర్ 30తో ముగుస్తుంది. ఈ ప్రక్రియ ముగియడానికి కొద్ది రోజులు మాత్రమే వ్యవధి ఉన్నది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం చాలా రాష్ట్రాలలో ఈ కార్యక్రమం కొనసాగుతున్నది. ఎప్పటికి పూర్తి కావచ్చనే దానిపై అంచనాలు లేవు.దీనికి ఒక ముఖ్య కారణం, ఓటర్ల జాబితాలలో ఉన్న తప్పులను సరిదిద్దడానికంటూ...అనేక అభ్యంతరాల మధ్య చేపట్టిన...'ప్రత్యేక సమగ్ర విచారణ' (ఎన్.ఐ.ఆర్) కార్యక్రమం గత నెలతో ముగిసింది. అన్ని రాష్ట్రాలలోని పూర్తి సిబ్బందిని ఈ కార్యక్రమానికి వినియోగించడం వల్ల జనగణన ప్రక్రియ మందకొడిగా సాగుతున్నదని చెప్పవచ్చు. ఎస్.ఐ.ఆర్ పై వస్తున్న విమర్శలను, దాని ఆవశ్యకతను చర్చించడం ఈ వ్యాసం ఉద్దేశం కాదు. అయినప్పటికీ ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితిని గమనిస్తే లక్ష?లాది ఓటర్లు తమ ఓటు హక్కు పోతున్నదని గగ్గోలు పెడుతున్నారు. ఈ విషయమై 'ఎన్నికల సంఘం' కూడా ప్రత్యేక ప్రకటనలు చేయాల్సి వస్తున్నది. ఈ ప్రక్రియ క్ష?త్ర స్థాయిలో పూర్తిగా, జాతీయ స్థాయిలో గణాంకాలను మదింపు చేసి విడుదల చేయాల్సి వుంది. ఆ సందర్భంలో కొత్తగా ఎన్ని కోణాలు ఆవిష్కృతమవుతాయో చూడాలి.ఒక విధంగా గమనిస్తే ఎస్.ఐ.ఆర్ కు, జనగణకు మధ్యన ఉన్న సంబంధాన్ని మనం విస్మరించలేం. ఓటరుగా నమోదు కాని వారి లేదా కుటుంబం సమాచారాన్ని జనగణనలో ఏ విధంగా లెక్కించాలి. అటువంటి వారిని పూర్తిగా విస్మరించడమేనా? వారి ఉనికిని ఏ విధంగా గుర్తించాలి? ఈ రెండు ప్రక్రియల మధ్యన ఉన్న 'లెక్కల అంతరాన్ని' ఏ విధంగా పరిష్కరిస్తారు? వంటి అనేక భయాందోళనలు ప్రజలలో నెలకొని ఉన్నాయి. ఎన్.ఐ.ఆర్ సమాచారాన్ని క్రోడీకరించి, విడుదల చేసిన తరువాత, జనగణన కొంత పురోగతి సాధించిన సమయంలో ఈ సమస్య మరింత జటిలంగా మారుతుంది. ఈ అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ చూపడంలేదు. వారి శ్రద్ధ అంతా జాతీయ స్థాయిలో ఏదో ఒక అంశాన్ని చర్చకు తేవడం, వివాదం సృష్టించడం ఆపైన దానిని మరుగునపరచడం. ఉదాహరణకు ఒకే జాతి, ఒకే ఎన్నిక (ఒన్ నేషన్, ఒన్ ఎలక్ష?న్). ఇది ప్రజాస్వామ్య విధానంలో ఏ విధంగా సాధ్యమో అర్థం కాదు. అలాగే పౌరులందరికీ కలిపి 'ఏకరూప పౌరస్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్). విభిన్న జాతులకు, భిన్న సంస్కృతులకు నిలయమైన దేశంలో దీనినెలా అమలు చేస్తారు?జనగణన మొదటి దశగా సాగుతున్న 'గృహ వసతి'కి సంబంధించి మొత్తంగా 31 ప్రశ్నలున్నాయి. గృహ వసతి వివరాలతో పాటుగా, టి.వి, రేడియో, మొబైల్, లాప్ టాప్, కంప్యూటర్, కారు, జీపు వంటి అనేక అంశాల సమాచారం ఉంది. స్థిర నివాసాలున్న వారి సంగతి పక్కన పెడితే, గృహ వసతి లేని వారు, సంచార జాతులకు సంబంధించిన సమాచారాన్ని ఏ విధంగా సేకరిస్తారో తెలియదు. అలాగే పై పరికరాల సమాచారాన్ని ప్రజలు ఏ మేరకు వెల్లడిస్తారన్నది సందేహమే. ఎందుకంటే ప్రభుత్వాలు అందించే 'ఉచితాలకు', వీటికి ఉన్న సంబంధం దృష్ట్యా, సమాచారాన్ని రాబట్టడం అంత తేలిక కాదు. 2011 జనాభా లెక్కల ప్రకారమే దేశంలో 1.77 మిలియన్ల మంది గృహ వసతిలేని, నిరాశ్రయులుగా ఉన్నారు. దీనికి తోడు మురికివాడలలో నివసించే 65.49 మిలియన్ల మంది అదనం. ప్రపంచంలోనే అత్యధిక మురికివాడలు, జనాభా కలిగిన దేశంగా భారతదేశం గుర్తింపు పొందింది.

# వైద్య సేవల్లో నూతన అధ్యాయం: అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో జనరల్ సర్జరీ సేవలు ప్రారంభం!








అశ్వారావుపేట, సెప్టెంబర్ 9 (నిర్భయ వార్త – జిల్లా ప్రతినిధి) అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రి ప్రజారోగ్య రక్షణలో మరో మైలురాయిని దాటింది. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా ఆసుపత్రిలో జనరల్ సర్జరీ (సాధారణ శస్త్రచికిత్స) సేవలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. చిన్నచిన్న ఆపరేషన్లకు సైతం సుదూర ప్రాంతాలైన కొత్తగూడెం, ఖమ్మం లేదా రాజమండ్రి వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఇకపై స్థానిక ఆసుపత్రిలోనే నిపుణులైన వైద్యుల సేవలు లభించనున్నాయి. సకాలంలో స్పందన -- విజయవంతమైన తొలి శస్త్రచికిత్స ఆసుపత్రిలో కొత్తగా ఐదుగురు నూతన వైద్యులు బాధ్యతలు స్వీకరించడంతో వైద్య సేవలు మరింత విస్తరించాయి. ఇందులో భాగంగా జనరల్ సర్జన్ డాక్టర్ అంబటి శైలేంద్ర కుమార్ నేతృత్వంలో దమ్మపేట మండలానికి చెందిన మొడియం జ్యోతి అనే మహిళకు మోకాలి పైభాగంలో ఉన్న కణితి (ట్యూమర్) ని తొలగించే శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ మౌనిక సహాయంతో తక్కువ మోతాదులో మత్తు మందు ఇచ్చి ఈ ఆపరేషన్ పూర్తి చేశారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రజారోగ్యానికి పెద్దపీట -- ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి మాట్లాడుతూ... నిరుపేద ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు నిరంతరం సహకరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐజనూ డాక్టర్ రవిబాబులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఆధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు ఏరియా ఆసుపత్రిలో ఉచితంగానే కార్పొరేట్ స్థాయి సర్జరీ సేవలు అందుబాటులోకి రావడం పట్ల అశ్వారావుపేట, దమ్మపేట మండలాల ప్రజలు, రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనుభవజ్ఞులైన డాక్టర్లు, పూర్తి స్థాయి సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తుండటంతో ఆసుపత్రిపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగింది. ఈ కార్యక్రమంలో జనరల్ సర్జన్ డాక్టర్ అంబటి శైలేంద్ర కుమార్, మత్తువైద్య నిపుణురాలు డాక్టర్ మౌనిక, ఆసుపత్రి ఆర్ఎంఓ (=మీా) డాక్టర్ మౌనిక, హెడ్ నర్సింగ్ ఆఫీసర్ వర్ధిని, ఓటీ నర్సింగ్ ఆఫీసర్ సుజాతతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఐటీడీఏ కాంప్లెక్స్ లో 33/11KV సబ్ స్టేషన్ నిర్మాణం పనులు వేగవంతం చేసి త్వరలో సబ్టేషన్ ప్రారంభించాలి : సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్





భద్రాచలం సెప్టెంబర్ 9 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలం ఐటీడీఏ నివాస గృహాలు,పరిసరాల్లో నివసిస్తున్న కాలనీలోని కుటుంబాలకు సౌకర్యవంతంగా విద్యుత్ కొరత, సమస్యలు తలెత్తకుండా 33/ నిర్మాణం చేపడుతున్న సబ్టేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేసి త్వరలో కరెంటు సరఫరా అయ్యే విధంగా సంబంధిత విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. బుధవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదేశాల మేరకు ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం వెనుక ఉన్న 30 కుంటల ఖాళీ స్థలంలో 33/11 కె.వి సబ్టేషన్ నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ నివాస గురు గృహాలు మరియు ఐటీడీఏ పరిధిలోని శివారు కాలనీలలో లోవోల్టేజి విద్యుత్ సమస్య వలన పరికరాలు ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైపోతున్నట్లు ప్రజల విజ్ఞప్తుల మేరకు విద్యుత్ శాఖ ద్వారా మూడు కోట్ల రూపాయల వ్యయంతో మార్చి నెలలో సబ్ స్టేషన్ నిర్మాణం పనులకు ప్రారంభించడం జరిగిందని, ఈ సబ్ స్టేషన్ నిర్మాణం పనులు మొదట్లో శరవేగంతో నడిచిన ఇంకా ఇంత వరకు నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఐటీడీఏ పీవో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాడని ఆయన అన్నారు. ఈ రెండు నెలలలో ఐటీడీఏ పీవో క్యాంప్ ఆఫీస్ ఐటిడిఏ నివాస గృహాలలో విద్యుత్ సరఫరా చేయడానికి లైన్ సర్వే చేసి సబ్ స్టేషన్ నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి పూర్తిచేసి విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీవో పవర్ కు ఆదేశించారు. ఈ సబ్టేషన్ నిర్మాణం వలన భద్రాచలం పట్టణం శివారు కాలనీలలో విద్యుత్ సమస్య అనేది ఉండదని, దాదాపు 5 వేల కుటుంబాలకు నిరంతరంగా విద్యుత్ సరఫరా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ విద్యుత్ శాఖ అధికారి వేణు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీ పాలనపై 'మాస్ లైన్' సింహగర్జన: నిత్యావసర ధరలు తగ్గించకపోతే ప్రజా గ్రహాగ్ని తప్పదు!

అశ్వారావుపేట సెప్టెంబర్ 9 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి ) కష్టజీవి కడుపు నిండాలంటే భయపడే పరిస్థితులు దాపురించాయి. రెక్కాడితే గానీ




డొక్కాడని సామాన్యుడిని ఒకవైపు ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు మింగేస్తుంటే, మరోవైపు పర్యవేక్షణ లేని దోపిడీ వ్యవస్థ నిలువునా దోచుకుంటోంది. ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, నిరుపేదల పక్షాన పోరాడే ఏకైక ప్రజా శక్తి తామేనని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ మరోసారి నిరూపించింది. బుధవారం అశ్వారావుపేట మండల కేంద్రంలో నిత్యావసర వస్తువుల ధరల విపరీతమైన పెరుగుదలను, మార్కెట్లో జరుగుతున్న అక్రమ దోపిడీని ఎండగడుతూ సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ మరియు వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట సింహగర్జన చేశారు. నిత్యావసరాల ధరలను తక్షణమే అదుపులోకి తేకపోతే ప్రజా గ్రహాగ్ని తప్పదని హెచ్చరిస్తూ తహశీల్దార్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ నిరసనలో ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు గోకినపల్లి ప్రభాకర్, ఏఐయూకేఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు కంగాల కల్లయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే తీరు వల్లే ఈ పరిస్థితి దాపురించిందని విమర్శించారు. ఒకవైపు నిత్యావసరాల ధరలు చుక్కలనంటుతుంటే, అధికారుల పర్యవేక్షణ లోపంతో నల్లబజారు దారులు తెరుచుకున్నాయని, కృత్రిమ కొరత సృష్టించి సామాన్యుడి రక్తాన్ని పిండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదాయాలు పెరగక, కూలీ దొరకక పేదలు అల్లాడుతుంటే ప్రభుత్వాలు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల హక్కుల కోసం ఎల్లప్పుడూ ముందుండే సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్, ఈ దోపిడీ వ్యవస్థపై రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. బాధ్యులపై అధికారులు కఠిన చర్యలు తీసుకుని, ధరలను వెంటనే తగ్గించకపోతే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ పోరాటంలో మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, పీవైఎల్ కార్యదర్శి బాడిస లక్ష్మణ్ రావు, పీఓడబ్ల్యు కార్యదర్శి కంగాల భూలక్ష్మి, నాయకులు కుంజా అర్జున్, కారం మల్లేష్, ధర్ముల శ్రీరాములు, కొమరం చిన్న లక్ష్మి, కొమరం సింగమ్మ, కబ్బాడి కవిత, కుర్సం పోతురాజు, తెల్లం సత్యం తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దుమ్ముగూడెంలో ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి వేడుక..




దుమ్ముగూడెం సెప్టెంబర్ 9 నిర్భయ వార్త ప్రతినిధి. దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రముఖ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ వైతాళికుడు కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీ కె.పి.డి. వరరాజు ముఖ్య అతిథిగా హాజరై, ముందుగా కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కాళోజి నారాయణరావు జీవితం, సాహిత్య ప్రస్థానం, సామాజిక స్పృహ మరియు ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటాలను వివరించారు. కాళోజి తన రచనల ద్వారా సామాన్య ప్రజల కష్టాలను, ఆకాంక్షలను, సామాజిక అసమానతలను ప్రజల ముందుకు తీసుకువచ్చారని తెలిపారు. ఆయన రచనల్లో తెలంగాణ ప్రజల జీవన విధానం, భాష, సంస్కృతి, సామాజిక చైతన్యం స్పష్టంగా ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి, అన్యాయాన్ని ప్రశ్నిస్తూ తన జీవితాన్ని ప్రజా చైతన్యానికి అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. విద్యార్థులు కాళోజి నారాయణరావు జీవితం, సాహిత్యం, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని, మంచి పౌరులుగా ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చీఫా ప్రోగ్రాం ఆఫీసర్ మల్లెల శ్రీనివాసరావు , అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని కాళోజి నారాయణరావు కి ఘనంగా నివాళులర్పించారు.




# భద్రాచలం లో 18,19 తేదీలలో ఎస్ జి ఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహణ

**భద్రాచలం ఎంఈఓ బెక్కంటి శ్రీనివాసరావు**



భద్రాచలం సెప్టెంబర్ 9 నిర్భయ వార్త ప్రతినిధి. స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 70వ మండల స్థాయి తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల భద్రాచలంలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం నాడు స్థానిక మండల వనరుల కేంద్రంలో మండలములోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాల ప్రధానోపాధ్యాయుల మరియు పిఈటి,పిడిలతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన బాలికలకు, 19వ తేదీన బాలురులకు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కావున మండలములోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని అందరూ క్రీడలలో పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు. పాఠశాల గేమ్స్ నిర్వహణకు మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు,కన్వీనర్ గా స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఆర్గనైజర్ , రమణ PD, SNM, ZPHS భద్రాచలం,కో కన్వీనర్స్ గా వీ. రమేష్, ఫిజికల్ డైరెక్టర్ GHS భద్రాచలం,ా సుజాత, ఫిజికల్ డైరెక్టర్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల భద్రాచలం, కమిటీల కోఆర్డినేటర్ గా రాజా శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా భద్రాచలం మండలంలోని అన్ని పాఠశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ డ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్స్ గా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్సన్, పటేల్, లక్ష్మీనారాయణ, బాలెన్దర్, లీల, హేమలత, సాయన్న, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి, కిషోర్, సిఆర్పిలు, సి సి హెచ్ ఓ లు, మండలంలోని వివిధ పాఠశాలల హై స్కూల్ ప్రాథమిక ఉన్నత ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..



# సివిల్స్ ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం ఐటీడీఏ పీవో బి రాహుల్



భద్రాచలం సెప్టెంబర్ 9 నిర్భయ వార్త ప్రతినిధి. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ రాజేంద్రనగర్లోని గిరిజన ఐఏఎస్ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో సివిల్స్ పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు శ్రీరామ్స్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (శ్రీరామ్స్ ఐఏఎస్ కోచింగ్) సంస్థ సహకారంతో రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు ఆసక్తిగల అభ్యర్థులు https: / /welfare.sriramsias.com వెబ్ సైట్ లో లాగిన్ అయ్యి పేర్లు, వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులను ఆబ్జెక్టివ్, ఆప్టిట్యూడ్ పరీక్షల ద్వారా ఎంపిక ఎంపిక చేస్తారని, దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకూడదని ఆయన అన్నారు. ఈ నెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలుపుతూ మరిన్ని వివరముల కొరకు 91210 87421, 62817 66534 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మీ మండలం పరిధి లోని గ్రామాలలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులను గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్స్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారిని తప్పనిసరిగా ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ ఉచిత శిక్షణకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేలా చూడాలని, ఈ ప్రకటన గురించి మండలాల వారీగా ముమ్మర ప్రచారం నిర్వహించి పత్రికా ప్రకటనలు జారీ చేయవలసిందిగా ఆయన కోరారు.

# శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి

**ముక్కోటి ఏకాదశి నాటికి ఉత్తర ద్వార దర్శనం పనులు పూర్తి చేయాలి**

**గోదావరి పుష్కరాల ప్రారంభం నాటికి గోదావరి ఘాట్,అభివృద్ధి నిర్మాణ పనులు సిద్ధం చేయాలి  ఐ టి డి ఏ పీవో బి.రాహుల్**






భద్రాచలం సెప్టెంబర్ 9 నిర్భయ వార్త ప్రతినిధి. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం పునరుద్ధరణ పనులు వేగవంతం చేసి ముక్కోటి ఏకాదశి నాటికి ఉత్తర ద్వార దర్శనం పనులు అలాగే గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికి గోదావరి ఘాట్ అభివృద్ధి పనులు భక్తులకు సౌకర్యంగా ఉండేలా నిర్మాణాలు పూర్తిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పున నిర్మాణ పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. చిత్రకూట మండపం పరిసరాలను,గోశాల ప్రాంతాన్నీ, అన్నదాన సత్రం,విస్తా కాంప్లెక్స్, శివాలయానికి వెళ్లే మార్గం, ఉత్తర ద్వార దర్శనం, రామాలయంలో జరుగుతున్న వలు అభివృద్ధి పనులు మాడవీధులను, పరిసర ప్రాంత అభివృద్ధి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అభివృద్ధికి సంబంధించిన వివరాలను సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు సూచించిన ప్రకారము అలాగే దేవస్థానం ఆగమ శాస్త్రం పండితులు సూచించిన విధంగా దేవాలయం అభివృద్ధి పనులు అగ్రిమెంట్ ప్రకారం అనుకున్న సమయం కంటే ముందుగానే సంబంధిత కాంట్రాక్టర్స్ , ఆర్కిటెక్చర్లు సకాలంలో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నెలలో జరిగే ముక్కోటి ఉత్సవాలలోపు ఉత్తర ద్వారా దర్శనం అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, వచ్చే ఏడాది ఏప్రిల్ లో జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాలలోపు అన్ని పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. వచ్చే ఏడాది 2027 జూన్ – జులై నెలలో జరిగే గోదావరి పుష్కరాల ప్రారంభంలోపు గోదావరి పరివాహక ప్రాంతంలో గల గోదావరి ఘాట్లు నిర్మాణాలు అభివృద్ధి పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఐటీడీఏ ఈ ఈ మధుకర్, దేవస్థానం డి ఈ రవీందర్రావు, ఆర్కిటెక్చర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కాళోజీ అడుగుజాడల్లో నడవాలి: శిక్షణా సహాయ కలెక్టర్ పారస్ కుమార్

**ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు.**



ఖమ్మం, సెప్టెంబర్– 9 నిర్భయవార్త రిపోర్టర్. తెలంగాణ వైతాళికుడు, ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి (తెలంగాణ భాషా దినోత్సవం) వేడుకలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి శిక్షణా సహాయ కలెక్టర్ పారస్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పారస్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలోని అన్యాయాలను, అక్రమాలను తన కలం బలం ద్వారా ఎండగట్టిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజాచైతన్యమే ఊపిరిగా జీవించిన కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని, ఆయన చూపిన బాటలో, అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, కేర్ టేకర్ వెంకన్న, సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని కాళోజీ నారాయణరావు సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు.

# అయిదు గ్రామపంచాయతీలను తిరిగి భద్రాచలం మండలంలో కలపాలని వినతి

**కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించిన భద్రాచలం కాంగ్రెస్ నాయకులు..**



భద్రాచలం సెప్టెంబర్ 9 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలం మండలంలో గతంలో ఉన్న అయిదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం మండలంలో విలీనం చేయాలని కోరుతూ రాష్ట్ర పెతిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో భద్రాచలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, సభ్యులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన భద్రాచలం మండలంలోని ఏటపాక, పురుషోత్తపట్నం, కన్నాయిగూడెం, గుండాల, పిచుకలపాడు అయిదు గ్రామపంచాయతీలను తిరిగి భద్రాచలం మండలం, తెలంగాణ రాష్ట్రంలో కలిపేలా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రివర్యులను కోరారు. ఇందులో భాగంగా, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే గార్ల ఆధ్వర్యంలో అయిదు గ్రామపంచాయతీల సర్పంచ్‌లతో ఏకగ్రీవ తీర్మానం చేయించి, ఆ తీర్మానంతో గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ని కలిసి వినతి పత్రం సమర్పించేందుకు సమయం కేటాయించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ని కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, పరిపాలనా ఇబ్బందులను మంత్రివర్యులకు వివరించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అయిదు గ్రామపంచాయతీలను తిరిగి భద్రాచలం మండలంలో విలీనం చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ, ఈ విషయంపై తప్పకుండా సానుకూల నిర్ణయం తీసుకునేందుకు కృషి చేస్తామని, భద్రాచలం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెతిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాస్ గారితో పాటు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతిరేల రవికుమార్, రత్నం రమాకాంత్, వెంకట్ రెడ్డి, తిరుపతి రావు, చిట్టిబాబు, నర్రా రాము, కారం దుర్గరావు, గాడి విజయ్, గౌతమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల నిర్వాహకులకు పోలీసుల సూచన




కారేపల్లి సెప్టెంబర్ 09 నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లి పోలీస్ వారి ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులకు కారేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గణేష్ మండపాల ఏర్పాటు, నిర్వహణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలపై నిర్వాహకులకు పోలీసులు వివరించారు. కారేపల్లి సి.ఐ సాగర్, ఎస్సై గోపి మాట్లాడుతూ  మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని, విద్యుత్ కనెక్షన్లు, వైరింగ్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. అలాగే ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. నిబంధనలు పాటిస్తూ గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని తెలిపారు.

# పోషణే ప్రగతికి పునాది  ఐటీడీఏ పీవో ఐఏఎస్ బి. రాహుల్




భద్రాచలం, సెప్టెంబర్ 9 నిర్భయ వార్త ప్రతినిధి. పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు మహిళల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అంగన్వాడీ టీచర్లు పని చేయాలని ఐటీడీఏ పీవో ఐఏఎస్ అధికారి బి రాహుల్ పిలుపునిచ్చారు. స్థానిక భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో పోషణ మాస ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ సంవత్సరం నినాదం అయినటువంటి "మన అంగనవాడి మన బాధ్యత" అని దానికి అనుగుణంగా షెడ్యూల్ ప్రకారం అంగన్వాడీ కేంద్రాలలో కార్యక్రమాలు నిర్వహించి అంగనవాడి కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్, పోషణ అభియాన్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, సంబంధిత శాఖల సమన్వయంతో నెలరోజుల పాటు వివిధ పోషణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించే సత్ఫలితాలు రాబట్టాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిని జే.స్వర్ణలత లెనీనా మాట్లాడుతూ పోషకాహార లోపాన్ని తగ్గించడం, ప్రతి కుటుంబానికి సమతుల్య ఆహారం ప్రాముఖ్యతను తెలియజేయడం, పిల్లల శారీరక మరియు మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాలను అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ప్రత్యేకంగా మొదటి 1,000 రోజులు, అంటే గర్భధారణ నుంచి చిన్నారి జీవితంలోని తొలి సంవత్సరాలు, అత్యంత కీలకమైనవిగా గుర్తించి తల్లులు, కుటుంబ సభ్యులకు సరైన పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత మరియు శిశు సంరక్షణపై అవగాహన కల్పించనున్నారు. పోషణ మాసం విజయవంతం కావాలంటే ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకం. ప్రతి తల్లి తన బిడ్డకు సరైన పోషకాహారం అందించడంతో పాటు, ప్రతి కుటుంబం పోషక విలువలు కలిగిన స్థానిక ఆహార పదార్థాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటిడిఓ రాధమ్మ, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రతాప్, నేషనల్ న్యూట్రిషన్ మిషన్ డిస్టిక్ కోఆర్డినేటర్ పొనుగోటి సంపత్, పోషణ అభియాన్ డిపిఏ బి.రాము తదితరులు పాల్గొన్నారు.

# కాలోజీ నారాయణరావు ఘనంగా జయంతి వేడుకలు

**ఆశ్రమం బాలికల పాఠశాలలో ఘనంగా నివాళులు పాల్గొన్న ఉపాధ్యాయులు, సిబ్బంది**

ములుగు సెప్టెంబర్ 9 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ప్రజాకవి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిప్రదాత



కాలోజీ నారాయణరావు జయంతి వేడుకలను వాజేడు మండలం గొల్లగూడెం ఆశ్రమ బాలికల పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రధానోపాధ్యాయులు నివాళులు అర్పించారు. కాలోజీ నారాయణరావు తన రచనలు, కవితల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సామాజిక అన్యాయాలను ప్రశ్నిస్తూ, ప్రజల సమస్యలను తన సాహిత్యంలో ప్రతిబింబించిన మహనీయుడిగా కాలోజీని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,పి బుచ్చిబాబు తిరుపతమ్మ, ధనలక్ష్మి సిబ్బంది పాల్గొని కాలోజీ సేవలను స్మరించుకున్నారు. కాలోజీ ఆశయాలను విద్యార్థుల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## భద్రాచలం అభివృద్ధే లక్ష్యం... ప్రజా సంక్షేమమే ధ్యేయం!

విద్య -- వైద్యం -- మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



భద్రాచలం సెప్టెంబర్ 9 నిర్భయ వార్త ప్రతినిధి. హైదరాబాద్‌లో అసెంబ్లీ సమావేశాల అనంతరం మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ తో కలిసి భద్రాచలం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించిన భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు.నియోజకవర్గంలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడం, మెరుగైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు.ప్రజల అవసరాలను గుర్తించి, నియోజకవర్గ ప్రగతిని వేగవంతం చేస్తూ, భద్రాచలం భవిష్యత్తును మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజా ప్రతినిధుల సమన్వయంతో నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో రెస్టారెంట్లపై ప్రత్యేక తనిఖీలు..










భద్రాచలం సెప్టెంబర్ 9 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీ ఈ. శరత్ ఆధ్వర్యంలో రెస్టారెంట్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 12 రెస్టారెంట్లను తనిఖీ చేయగా, ఆహార భద్రతా నిబంధనలు పాటించని రెస్టారెంట్లకు 7 ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు.తనిఖీల సందర్భంగా నాణ్యత పరిశుభ్రత ప్రమాణాలకు అనుగుణంగా లేని 15 కిలోల గ్రేవీ, 20 కిలోల మాంసం, 3 కిలోల మసాలా పేస్ట్, మొత్తం 38 కిలోల ఆహార పదార్థాలను డిస్కార్డ్ చేశారు.లోపాలను సరిదిద్దుకునేందుకు సంబంధిత రెస్టారెంట్లకు 15 రోజుల గడువు ఇచ్చారు. ఆహార పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయడం, వంట ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం, నాణ్యమైన ముడి పదార్థాలను ఉపయోగించడం మరియు ఖీూూ× నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. ప్రజలకు సురక్షితమైన మరియు నాణ్యమైన ఆహారం అందించేందుకు ఆహార భద్రతా శాఖ ప్రత్యేక తనిఖీలు కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు..

## కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఘనంగా ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి



కారేపల్లి, సెప్టెంబర్ 9: నిర్భయవార్త రిపోర్టర్ ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని కారేపల్లిలో కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ కాళోజి నారాయణరావు తన రచనలు, కవితల ద్వారా ప్రజల సమస్యలను, సామాజిక అసమానతలను ఎత్తిచూపారని గుర్తు చేశారు. కాలేజీ నారాయణ సిద్ధాంతాలను విద్యార్థులకు వివరించారు.ప్రజల పక్షాన నిలబడి అన్యాయాన్ని ప్రశ్నించిన కాళోజి సాహిత్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని తన రచనల్లో ప్రతిబింబించిన మహోన్నత కవి కాళోజి అని కొనియాడారు.కాళోజి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

## నాయుడు కుంట శుభ్రతపై మున్సిపల్ కమిషనర్‌కు కర్నే రవి ఫిర్యాదు

**బతుకమ్మ వేడుకలకు ముందే చెత్త, గుర్రపుడెక్క తొలగించి సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి**



మణుగూరు, సెప్టెంబర్ 09 నిర్భయ వార్త ప్రతినిధి: రాబోయే బతుకమ్మ పండుగను దృష్టిలో ఉంచుకుని మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని నాయుడు కుంటను తక్షణమే శుభ్రపరిచి, మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం మణుగూరు పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు నాయుడు కుంట వద్దకు చేరుకుని బతుకమ్మలను నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.అయితే ప్రస్తుతం నాయుడు కుంట పరిసరాలు, చెరువు గట్టు వద్ద చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయని, చెరువు నీటిలో నాచు, గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బతుకమ్మ నిమజ్జనం కోసం వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు.పారిశుధ్య సమస్యతో పాటు చెరువు వద్ద భద్రతాపరమైన ఇబ్బందులు కూడా తలెత్తే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కర్నే రవి కోరారు. పండుగకు ముందే చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా తొలగించి, చెరువులోని గుర్రపుడెక్క, నాచు, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరచాలని విజ్ఞప్తి చేశారు.అలాగే బతుకమ్మ నిమజ్జన ప్రాంతంలో తగిన లైటింగ్, భద్రతా ఏర్పాట్లు చేపట్టి మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. బతుకమ్మ పండుగకు ముందుగానే ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి నాయుడు కుంటను నిమజ్జనాలకు అనువుగా సిద్ధం చేయాలని కర్నే రవి మున్సిపల్ అధికారులను కోరారు.

## జర్నలిస్టుల ఆరోగ్య పథకం హామీని నెరవేర్చండి

### :-TUWJ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ










ఆదిలాబాద్ సెప్టెంబర్ 9 నిర్భయవార్త జిల్లా బ్యూరో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా, ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇచ్చిన ఆరోగ్య పథకం హామీని ఇంతవరకు నెరవేర్చకపోవడం విచారకరమని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు ఆరోగ్య పథకాన్ని అమలు చేసి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ కోరారు. బుధవారం నాడు ఆదిలాబాద్ పట్టణంలోని తరంగిణి ఫంక్షన్ హాలులో జరిగిన, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఆదిలాబాద్ జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో ఎనిమిదేళ్లుగా జేహెచ్ఎస్ పథకం అమలుకాకపోవడంతో అనారోగ్యాలకు గురవుతున్న జర్నలిస్టులు చికిత్స కోసం పడుతున్న తిప్పలు వర్ణనాతీతమని విరాహత్ అలీ ఆందోళన వ్యక్తం చేసారు. కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందే ఆర్థిక స్థోమత లేక, ఇప్పటికే వందల సంఖ్యలో జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆయన విచారం వ్యక్తం చేసారు. ఈ విషయాన్ని తాము పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, ఎలాంటి ఫలితం మాత్రం లేదన్నారు. ఇప్పటికైనా ఆరోగ్య పథకాన్ని అమలుచేసి జర్నలిస్టుల ప్రాణాలకు భరోసా కల్పించాలని ఆయన కోరారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో, జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల మంజూరీలో కలెక్టర్లు తిరకాసులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే అలాంటి వైఖరికి స్వస్తి పలికి కార్డులను మంజూరీ చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జర్నలిస్టుల పట్ల వ్యవహారిస్తున్న వైఖరిని ఆయన ఖండించారు. జిల్లాలో 15మంది జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా, వారికి మంజూరు అయిన అక్రెడిటేషన్ కార్డులను లాక్కోవడం సహించరానిదన్నారు. వెంటనే అక్రమ కేసులను ఉపసంహారించుకోవాలని, లేనిపక్షంలో పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. అలాగే జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అక్రెడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న జర్నలిస్టులపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో విచారణ జరిపించడం సహించరానిదని విరాహత్ ఆందోళన వ్యక్తం చేసారు. ఈ ఇద్దరు అధికారుల వైఖరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన స్పష్టం చేసారు. జర్నలిజం వృత్తి పట్ల సమాజంలో విశ్వాసం సన్నగిల్లుతున్న నేటి పరిస్థితుల్లో, పవిత్రమైన మీడియా వృత్తికి పూర్వ వైభవం దక్కించేందుకు గాను నైతిక విలువలతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉంటుందని ఆయన సూచించారు. ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా ఆదిలాబాద్ జిల్లాలో తమ సంఘం ఎంతో బలోపేతంగా ఉందని, అయితే సభ్యుల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా జిల్లా నూతన కమిటీ చిత్తశుద్ధితో సేవలందించాలని ఆయన సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్, ప్రకాష్ రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం నాయకుడు హన్మంత్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, కార్యదర్శి దేవేందర్ లతో పాటు జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న దాదాపు 200 మంది జర్నలిస్టులు హాజరయ్యారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.

ఖమ్మం, సెప్టెంబర్– 09 నిర్భయవార్త రిపోర్టర్. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక విగ్రహాల నిమజ్జనం ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎన్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి సంబంధిత అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో నిమజ్జన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఘనంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని అన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రెట్టింపు స్థాయిలో ఏర్పాట్లు, ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తక్కువగా ఉందని, గతేడాది ఖమ్మం నగర పరిధిలోనే 1,000కు పైగా వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగిన నేపథ్యంలో ఈ ఏడాది నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. మున్నేరు బ్రిడ్జి వద్ద ప్రస్తుతం అవసరమైన స్థాయిలో నీరు అందుబాటులో లేనందున నిమజ్జనంకు భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని అనువైన ప్రాంతంలో ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా సంబంధిత శాఖల అధికారులు, పోలీస్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవరించాలని కలెక్టర్ సూచించారు.ప్రస్తుతం ఉన్న పరిస్థితులను, సమాచారాన్ని ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీలు, అధికారులు సమన్వయంతో విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమాచారం ప్రతి ఒక్కరికీ ముందుగానే చేరేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఏటా జరిగే కార్యక్రమమేననే కారణంతో నిర్లక్ష్యం చేయకుండా, పరిస్థితులకు అనుగుణంగా మరింత అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని రకాల



సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు.శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ రాకపోకలు సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అన్నారు.

**రూట్‌మ్యాప్, ట్రాఫిక్ డైవర్షన్‌పై ముందస్తు ప్రచారం:** వినాయక విగ్రహాల నిమజ్జనానికి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేసి ప్రజలకు, ఉత్సవ కమిటీలకు తెలియజేయాలని కలెక్టర్ అన్నారు. ట్రాఫిక్ డైవర్షన్ అడ్వైజరీని సెప్టెంబర్ 20వ తేదీ సాయంత్రానికల్లా విడుదల చేయాలని సూచించారు.పోలీస్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నిమజ్జన పాయింట్లపై తుది నిర్ణయం తీసుకోవాలని, నిమజ్జనం సందర్భంగా ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన సంఖ్యలో ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేయాలని సూచించారు.రూట్ మార్పులకు అనుగుణంగా విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ఇంటర్నెట్, టీవీ కేబుల్స్ తదితర వాటిని అవసరమైన చోట్ల సర్దుబాటు చేసి, విగ్రహాల తరలింపునకు ఎలాంటి ఆటంకం లేకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.నిమజ్జన రూట్‌లో రహదారి మరమ్మతు పనులు ఉంటే వెంటనే చేపట్టి పూర్తిచేయాలని, నిమజ్జన పాయింట్లకు అప్రోచ్ రోడ్లు సక్రమంగా ఉండేలా చూడాలని అన్నారు.

**విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు:**
గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గణేష్ మండపానికి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా లైన్‌మ్యాన్ ద్వారా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు స్వయంగా అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకొని ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ తీగల వల్ల ఎలాంటి విద్యుత్ షాక్ ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, గణేష్ మండపాల్లో షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని అన్నారు.

**నిమజ్జన పాయింట్ల వద్ద అన్ని మౌళిక సదుపాయాలు:**
జిల్లాలోని ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద అవసరమైన బ్యారికేడ్లు, క్రేన్లు, విద్యుత్ సరఫరా, త్రాగునీరు, లైటింగ్ తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విగ్రహాల తరలింపు సమయంలో అడ్డుగా వచ్చే చెట్ల కొమ్మలను ముందుగానే తొలగించాలని, జిల్లాలో ఎత్తైన విగ్రహాల తరలింపును ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేరకు గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని, స్విమ్మర్లతో ముందుగానే సమన్వయం చేసుకుని వారికి షిఫ్టుల వివరాలు తెలియజేయాలని అన్నారు.

**వైద్య, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి:**
ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని, మందులు తదితర అత్యవసర వైద్య సామగ్రిని సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు.నిమజ్జన పాయింట్ల వద్ద షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి నిరంతరం పరిశుభ్రతను పర్యవేక్షించాలని అన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండపంలో చేపట్టిన ఏర్పాట్లు, అవసరమైన భద్రతా చర్యల వివరాలను ముందుగానే తెలుసుకోవాలని సూచించారు. ప్రతి గణేష్ మండపం వద్ద పోలీస్, ఫైర్, విద్యుత్, హెల్త్ తదితర అత్యవసర సేవల అధికారుల సంప్రదింపు వివరాలతో కూడిన చిన్న పోస్టర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.నిమజ్జనం సందర్భంగా జిల్లాలో ఎక్కడా మద్యం విక్రయాలకు అనుమతి ఇవ్వకూడదని, మద్య నిషేధాన్ని కట్టు దిట్టంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. రామారావు, స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రెసిడెంట్ వినోద్ లహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ కె. జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, ట్రెజరర్ ఎం. శ్రీహరి, సెక్రటరీ డోవలె సాయికిరణ్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా కేంద్రంలో మహిళా కాంగ్రెస్ పార్టీ నిరసన

### మహిళా కానిస్టేబుల్స్ మీద అసభ్యకరంగా ప్రవర్తించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను చెప్పులతో కొట్టాలి

### ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి





ములుగు సెప్టెంబర్ 9 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) సోమవారం అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిన రోజున బిఆర్ఎన్ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఆవరణలో నల్ల టీషర్ట్స్ ధరించి అసెంబ్లీ గేట్ ముందు విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్స్ మీద బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అసభ్యకర ప్రవర్తనకు నిరసనగా బుధవారం ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మద్దాలి నాగమణి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు చేసిన చర్యలను మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి తీవ్రంగా ఖండించారు .బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఆవరణలో టీషర్ట్ విప్పి మహిళా కానిస్టేబుల్స్ ముందు అసభ్యకరంగా వ్యవహరించిన తీరును ఖండిస్తూ ములుగు జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించి బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల దిష్టిబొమ్మ దహనం చేశారు బిఆర్ఎస్ పార్టీ నాయకులకు మహిళల పట్ల ఉన్న గౌరవం ఎలాంటిదో రాష్ట్ర ప్రజలందరికీ అర్థం అవుతుందని కన్న కూతురినే గెంటేసిన మీ నాయకునికి సొంత చెల్లిని బాధపెట్టిన కేటీఆర్ కి మహిళల పట్ల మహిళా ఉద్యోగుల పట్ల ఉండే మర్యాద తెలుస్తుందని మహిళ కానిస్టేబుల్స్ మీద బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు మిగతా ఎమ్మెల్యేలు చేసిన చర్యలకువారిని చెప్పులతో కొట్టాలని వారు ఇకనైనా బుద్ధి తెచ్చుకుని మారాలని హెచ్చరించారు.

## మేరు జాతి మహిళా ఉద్యమకారులకు ఘన సన్మానం

### రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన భరతక్క, వనజక్కలకు సత్కారం





వరంగల్ సెప్టెంబర్ 9 నిర్భయవార్త జిల్లా బ్యూరో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమాలకు పురిటిగడ్డగా నిలిచిన నేపథ్యంలో, రైతుల హక్కుల కోసం, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం తమ జీవితాలను పణంగా పెట్టి ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న మేరు జాతి మహిళా ఉద్యమకారులకు ఘనంగా సన్మానం జరిగింది. ప్రజా ఉద్యమ నేత అక్కరాజు హరిగోపాల్ అలియాస్ రామకృష్ణ సతీమణి సింగు సిరిష అలియాస్ భరతక్క, సుదీర్ఘకాలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లో ప్రజా ఉద్యమాల్లో పనిచేసిన పటేల్ సుధాకర్ రెడ్డి సతీమణి పటేల్ వనజ అలియాస్ కాపురి వనజక్కలను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మేరు కార్పొరేషన్ చైర్మన్ సంగా వెంకటరాజం, వైస్ చైర్మన్ మాడిశెట్టి లక్ష్మీనారాయణ, రాష్ట్ర మేరు సంఘం నాయకులు మునగాల రమేష్, మునగాల రాము, జిల్లా నాయకులు రాయబారు సంతోష్ తదితరులు పాల్గొని వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ సంగా వెంకటరాజం మాట్లాడుతూ... "మేరు జాతిలో పుట్టి రైతుల హక్కులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం తమ జీవితాలను, కుటుంబాలను సైతం పణంగా పెట్టి ప్రజా ఉద్యమాల్లో పోరాడిన భరతక్క, వనజక్కలు మేరు జాతి మహిళలకు ఆదర్శప్రాయులు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో, ఎందరో ఉద్యమకారుల త్యాగాల స్ఫూర్తితో మేరు జాతి మహిళలు సామాజిక, రాజకీయ రంగాల్లో ముందుకు రావాలి. చిన్న జనాభా కలిగిన మేరు కులంలో పుట్టిన మహిళలు ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించడం మేరు జాతికి గర్వకారణం. వారి పోరాట స్ఫూర్తిని తెలంగాణలోని మేరు కులస్తులు, ముఖ్యంగా మేరు మహిళలు ఆదర్శంగా తీసుకుని రాజకీయంగా, సామాజికంగా ఎదగాలి. భరతక్క, వనజక్కల ప్రజాసేవా స్ఫూర్తి రానున్న తరాలకు ఆదర్శంగా నిలుస్తుంది. వారు ఇకముందు కూడా ప్రజాసేవలో కొనసాగుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, బీసీ వర్గాల సంక్షేమానికి, మేరు జాతి అభివృద్ధికి తమ సేవలను అందించాలి. రానున్న రోజుల్లో ప్రజాక్షేత్రంలో మరింతగా ఎదిగి రాజకీయ రంగంలో రాణించి చట్టసభల్లో అడుగుపెట్టాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ సన్మానం కేవలం ఇద్దరు మహిళా ఉద్యమకారులకు చేసిన సత్కారం మాత్రమే కాదు, తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన మేరు జాతి మహిళల పోరాట స్ఫూర్తికి ఇచ్చిన గౌరవం" అని అన్నారు. మేరు జాతి మహిళల పోరాట పటిమ, త్యాగం, ప్రజాసేవా స్ఫూర్తిని సమాజం గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

# రామ్మోహన్ లైబ్రరీకి స్వర్గీయ డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ పేరిట మెడికల్ పుస్తకాల బహుకరణ.

## సామాజిక సేవకు డాక్టర్లు అంకితం కావాలని కోరిన ఆకుల శ్రీనివాస్.



విజయవాడ, నిర్భయవార్త ప్రతినిధి : అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సీనియర్ రాజకీయ నాయకులు, ప్రముఖ సామాజిక వేత్త ఆకుల శ్రీనివాస కుమార్ తన కుమారుడు స్వర్గీయ డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ జ్ఞాపకార్థం బందరు లాకుల వద్ద ఉన్న అటల్ బిహారీ వాజ్‌పేయి విజ్ఞాన కేంద్రంలోని రామ్మోహన్ గ్రంథాలయానికి ఎంతో విలువైన మెడికల్, ఎంబీబీఎస్‌కు సంబంధించిన పుస్తకాలను అందజేశారు. రామ్మోహన్ గ్రంథాలయం అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ రామచంద్రరావు, సెక్రటరీ వేములపల్లి శంకర్రావులకు ఆకుల శ్రీనివాస కుమార్ ఈ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ విజ్ఞానాన్ని అందరికీ పంచాలన్న సదుద్దేశంతో ఆకుల శ్రీనివాస్ తన కుమారుడి జ్ఞాపకార్థం వైద్య విద్యకు సంబంధించిన విలువైన పుస్తకాలను గ్రంథాలయానికి అందించడం అభినందనీయమని అన్నారు. 115 సంవత్సరాల చరిత్ర కలిగిన రామ్మోహన్ గ్రంథాలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని చెప్పారు. ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు, విద్యావేత్తలు, మేధావులు, సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన అనేకమంది ఈ గ్రంథాలయాన్ని ఉపయోగించుకున్నారని తెలిపారు. ప్రస్తుతం కూడా అనేకమంది విద్యార్థులు, యువత గ్రంథాలయాన్ని ఉపయోగించుకుంటున్నారని, ఇలాంటి సమయంలో వైద్య విద్యకు సంబంధించిన విలువైన పుస్తకాలను అందించడం ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. తన కుమారుడి జ్ఞాపకార్థం పుస్తకాలను అందించడం ద్వారా ఆయన జ్ఞాపకాలను సమాజానికి ఉపయోగపడేలా నిలబెట్టడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఆకుల శ్రీనివాస కుమార్ కుటుంబానికి భగవంతుని ఆశీస్సులు ఉండాలని, డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం ఆకుల శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నిరక్షరాస్యులు లేకుండా ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్న లక్ష్యంతో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్య అనేది వ్యక్తి జీవితాన్నే కాకుండా సమాజం మొత్తాన్ని అభివృద్ధి చేసే గొప్ప సాధనమని అన్నారు. పుస్తక భాండాగారంగా ఎంతో గొప్ప చరిత్ర కలిగిన రామ్మోహన్ గ్రంథాలయానికి రావడం, ఇక్కడ తన కుమారుడి జ్ఞాపకార్థం వైద్య విద్యకు సంబంధించిన పుస్తకాలను అందించడం తనకు ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. రామ్మోహన్ గ్రంథాలయాన్ని అనేకమంది ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యావంతులు ఉపయోగించుకున్నారని, ఇలాంటి చారిత్రక గ్రంథాలయానికి తన కుమారుడి జ్ఞాపకార్థం పుస్తకాలను అందించడం తనకు ఎంతో సంతృప్తిని కలిగిస్తోందని ఆకుల శ్రీనివాస కుమార్ తెలిపారు. తన కుమారుడు డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోవడంతో పాటు ఆయన సేవా స్ఫూర్తి మరింతమందికి చేరాలన్న ఉద్దేశంతోనే ఈ పుస్తకాలను అందించినట్లు చెప్పారు. ముఖ్యంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్క విద్యార్థి వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మరింతమంది విద్యార్థులు వైద్య వృత్తిలోకి వచ్చి పేదలు, బలహీన వర్గాలు, అవసరంలో ఉన్న ప్రజలకు సేవ చేయాలని కోరారు. తన కుమారుడు స్వర్గీయ ఆకుల రాజ్ కుమార్ అందించిన సేవా స్ఫూర్తి కొనసాగుతూ భవిష్యత్‌లో మరెంతోమంది వైద్యుల రూపంలో సమాజానికి సేవ అందించాలని ఆకుల శ్రీనివాస కుమార్ ఆకాంక్షించారు. ఒకరి జ్ఞాపకార్థం అందించిన పుస్తకాలు రాబోయే రోజుల్లో ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడనున్నాయి. జ్ఞానాన్ని పంచడం ద్వారా తన కుమారుడి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా ఆకుల శ్రీనివాస కుమార్ చేపట్టిన ఈ కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంది.

# పోలీస్ ఉద్యోగాలకు ఏజ్ లిమిట్ పెంచండి: బల్మూరి వెంకట్



హైదరాబాద్ : నిర్భయవార్త ప్రతినిధి : 7,437 పోలీస్ ఉద్యోగాలకు ఏజ్ లిమిట్ పెంచాలని సీఎం రేవంత్ను ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ కోరారు. కరోనా పరిస్థితులు, నోటిఫికేషన్ల ఆలస్యం కావడం వల్ల చాలా మంది నిరుద్యోగులు వయో పరిమితి మించిపోయి, అర్హత కోల్పోతున్నారని వివరించారు. దీంతో కానిస్టేబుల్ ఉద్యోగానికి 34 నుంచి 36 ఏళ్లకు, ఎస్సై ఉద్యోగానికి 37 నుంచి 38 ఏళ్లకు వయో పరిమితి పెంచాలని కోరారు. దీనిపై జవీ సానుకూలంగా స్పందించారని వెంకట్ చెప్పారు.

# ఆయుష్మాన్ భారత్.. రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం

నిర్భయవార్త ప్రతినిధి త.ఆయుష్మాన్ భారత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం పేదలకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందే అవకాశం కల్పిస్తోంది. ఈ పథకం ద్వారా ఎలాంటి వయస్సు లేదా కుటుంబ పరిమితి లేకుండా చికిత్సను పొందవచ్చు. ఈ పథకం కింద 1700లకు పైగా వైద్య సేవలను, ఇప్పటికే ఉన్న వ్యాధులను కూడా కవర్ చేస్తుంది. అర్హులు ఆన్‌లైన్‌లో లేదా జూజ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. తమ అర్హతను తనిఖీ చేసి, ఆధార్ ఆధారిత ధృవీకరణతో కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ కార్డుతో ఆసుపత్రులలో నగదు రహిత చికిత్స పొందవచ్చు.

# పెరిగిన నిత్యావసరాల ధరల నియంత్రణలో కూటమి ప్రభుత్వం వైఫల్యం!.

## ధరలు కొనేవాడికి ఆకాశంలో...అమ్మేవాడికి పాతాళంలో!!.

## దళారులకు, పెట్టుబడి దారులకు సంపద సృష్టిస్తున్న కూటమి ప్రభుత్వం....జి.ఈశ్వరయ్య.

## "కొనబోతే కొరివి...అమ్మబోతే అడివి"

అమరావతి, నిర్భయవార్త ప్రతినిధి : అన్న చందంగా రాష్ట్రంలో కృట్నమి పాలన నడుస్తుందని, సామాన్య ప్రజలు పెరిగిన నిత్యవసరాల ధరల స్థాయికి తగ్గట్టు ఆదాయం పెరగక పోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆకలిని, ఆశలను చంపుకొని బతకాల్సిన పరిస్థితులు నేడు రాష్ట్రలో నెల్లకోన్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తం చేసారు. రాష్ట్రంలో రోజురోజుకి పెరుగుతున్న నిత్యవసరాల ధరలు సామాన్యునిపై గుదిబండగా మారాయి అని, ప్రభుత్వం వెంటనే నిత్యవసరాల ధరల స్థిరీకరణకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఈ నెల 9 వ తేదీన రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపు ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా స్థానిక వన్ టౌన్, పంజా సెంటర్ లో సిపిఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరరరావు అధ్యక్షతన నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి నాయకులు మేము అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యవసరాల ధరలు తగ్గించి పేదవానికి అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ధరల తగ్గించడం పక్కకు పెట్టి గతంలో అంటే 2024 నాటికీ ఉన్న ధరలను అమాంతం పైకి ఎగబాయించి సమస్య ప్రజలకు కనీసం ఆకలి తీర్చుకునే హక్కును కూడా హరించే విధంగా ధరల పెరుగుతున్నప్పటికీ కూటమికి ప్రభుత్వం ధరల నియంత్రణకు అదేవిధంగా పంట పండించిన గిట్టుబాటు ధరల కల్పనకకు పటిష్ట చర్యలు చేపట్టకుండా, దళారీ, బ్లాక్ మార్కెట్ వ్యవస్థకు కొమ్ముకాస్తూ పెట్టుబడి దారులకు సంపద సృష్టే ప్రధాన ఏజెండగా పాలనా సాగిస్తుందని ఎద్దేవా చేసారు. నేడు రాష్ట్రంలో ప్రజల ఆహార అవసరాలు తీర్చే బియ్యం ధర కేవలం రెండు నెలల వ్యవధిలో బస్తాకు 500 రూపాయులు




పెరగడం, వంట నూనె, చక్కెర, ఉల్లిపాయలు, పప్పులు ఇలా ఏది కావాలన్నా ఈ రోజు గతంలో ఉన్న ధరలకు రెండు నుండి నేడు రేట్లు అధికంగా చెల్లించాల్సిన పరిస్థితి దాపురించిందని, మరి ఈ రోజు ఆ ధరలను అందుకునే స్థాయిలో సామాన్యుని ఆదాయం పెరిగిందా అని ప్రభుత్వాన్ని ప్రశించారు. మరో పక్క మరో పక్క రాష్ట్రంలో పంట పండించిన రైతుకు మాత్రుమమ్ గిట్టుబాటుధర లేక అలమటిస్తున్నాడని మరి పెరిగిన ఈ దరల వ్యత్యాసం ఎవరి జేబులలోకి చేరుతుందని ప్రశించారు. పెరుగుతున్న నిత్యవసరాల కొరత ఆసరాగా చేసుకొని దళారులు నిత్యవసరాలను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తూ ప్రజల అవసరాలను వారి ఆదాయవాన రాలుగా మారుస్తుంటే పాలకులు బ్లాక్ మార్కెట్ దళారులకు, పెట్టుబడి దారులకు సంపద సృష్టిస్తూ సామాన్యునికి వెన్నుపోటు పొడుస్తోందని, మరో పక్క కేంద్ర ప్రభుత్వం యుద్ధాల పేరుతో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను రికార్డు స్థాయికి పెంచి వారి రికార్డులను వారే అధికమించే దిశగా పాలనా సాగించడంతో దరల పెరుగుదలకు ఈ రోజు రవాణా వ్యయం పెరగటం కూడా ఒక ప్రధాన కారణంగా చెప్పవచ్చు అని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా నిత్యవసరాలైన బియ్యంతో పాటు, చక్కర, వంటనూనె, పప్పులు వంటి 14 రకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అదేవిధంగా ధరల స్థిరీకరణకు, బ్లాక్ మార్కెట్ నిరోధానికి పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరించి వ్యవహరిస్తే రానున్న రోజులలో ప్రజల సహకారంతో బ్లాక్ మార్కెట్ అరికట్టేందుకు అవసరమైతే గోడౌన్ లపై మేమే దాడులు నిర్వహించి ప్రజలకు నిత్యవసరాలను ప్రజలకు అందుబాటులకి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని తెలియజేసారు.

# ఆపదలో ఆదుకునే ఆపన్నహస్తం..

**సీఎం రిలీఫ్ ఫండ్‌తో 18 కుటుంబాలకు భరోసా!**
**రూ.9.39 లక్షల వైద్యసహాయ చెక్కులు..**
**బాధితుల గడప వద్దకే వెళ్లి అందజేసిన ఎమ్మెల్యే తాతయ్య.**

జగ్గయ్యపేట,నిర్భయవార్త ప్రతినిధి :అనారోగ్యం ఓ కుటుంబాన్ని ఆర్థికంగా కుదేలు చేసిన వేళ.. వైద్య ఖర్చులు భారంగా మారిన సమయంలో.. ప్రభుత్వమే అండగా నిలిచింది. ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ =వశ్రీఅవట ఖీబఅం) ద్వారా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన 18 మంది బాధిత కుటుంబాలకు రూ.9,39,140 ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ సహాయాన్ని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) బాధితుల ఇళ్లకు స్వయంగా వెళ్లి చెక్కుల రూపంలో అందజేశారు. వైద్య ఖర్చులకు ప్రభుత్వ భరోసా ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనారోగ్య సమస్యలకు చికిత్సలు, శస్త్రచికిత్సలు చేయించుకున్న పలువురు కుటుంబాలు భారీగా వైద్య ఖర్చులు భరించాల్సి వచ్చింది.



ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని స్థానిక నాయకులు ఎమ్మెల్యే తాతయ్య దృష్టికి తీసుకెళ్లారు. బాధితకుటుంబాల సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, వారి వైద్య బిల్లులు, అవసరమైన పత్రాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఫలితంగా 18 కుటుంబాలకు మొత్తం రూ.9,39,140 మంజూరైంది. గడప వద్దకే వెళ్లి.. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ధైర్యంసహాయ నిధి చెక్కులను కార్యాలయంలో అందజేయడంతో సరిపెట్టకుండా, ఎమ్మెల్యే తాతయ్య స్థానిక నాయకుల తో కలిసి బాధితుల ఇళ్లకు స్వయంగా వెళ్లి చెక్కులను అందజేశారు. బాధితులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి ని అడిగి తెలుసుకున్నారు. "ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ప్రభుత్వం అండగా ఉంటుంది.. ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదు" అనే భరోసాను బాధిత కుటుంబాలకు కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య ఖర్చుల భారాన్ని కొంతమేర తగ్గించు కోవాలని సూచించారు. ప్రజలకు ముఖ్యమైన సందేశం.. సంక్షేమ పథకాలు తెలుసుకోండి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల పై ప్రజలు అవగాహన పెంచు కోవాలని ఈ సందర్భంగా స్థానిక నాయకులు సూచించారు. అనారోగ్యం, ఆపద వంటి క్లిష్ట పరిస్థితుల్లో అర్హత ఉన్న కుటుంబాలకు అందుబాటులో ఉన్న ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి ప్రభుత్వ సహాయ పథకాలపై సమాచారం తెలుసుకుని, అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా.. అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మరింత మంది నిరుపేదలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. అభివృద్ధితో పాటు.. ఆపదలో అండగాకూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తాతయ్య పేర్కొన్నారు. పేదలు, మధ్యతరగతి కుటుంబాలు, రైతులు, మహిళలు, యువత, వృద్ధులు, నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోరహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, మౌలిక వసతులు, గ్రామీణాభివృద్ధితో పాటు ప్రజల వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి కూడా నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. 18 కుటుంబాలకు అందిన వైద్య సహాయం బూరెల సంపూర్ణకు రూ.41,870, వేముల నరసింహారావుకు రూ.23,420, ఉప్పతల శ్రీరాములకు రూ.30,000, దేవరశెట్టి భవానికి రూ.42,074, దుడ్డుల ప్రభాకర్‌రావుకు రూ.1,00,258,కాకనబోయిన దుర్గకు రూ.30,000, అమరబోయిన రాంబాబుకు రూ.1,54,142,వెంకటేశ్వర్లుకు రూ.1,03,117, రామ్ బహదూర్ రౌల్‌కు రూ.1,09,855, షేక్ సాదియాకు రూ.18,460, యాదల నాగరాజుకు రూ.45,000, పఠాన్ బిజాన్బికి రూ.11,757, ప్రణీతకు రూ.31,377, వల్లూరి రాధాకు రూ.46,084, చిలుకూరి గోపి వర్ధన్‌కు రూ.33,278, గిరిజకు రూ.49,258, బచ్చలకూరి కుమారికి రూ.29,461, మల్లెల స్వాతికి రూ.39,729 చొప్పున చెక్కులు అందజేశారు. "ప్రజల కన్నీరు తుడవడమే నిజమైన ప్రజాసేవ" ఆపదలో ఉన్న కుటుంబాల వద్దకు వెళ్లి వారి బాధను తెలుసుకోవడం, ప్రభుత్వ సహాయాన్ని అందించడంతో పాటు వారికి ధైర్యం చెప్పడం పట్ల ఎమ్మెల్యే తాతయ్యను బాధిత కుటుంబాలు, స్థానిక ప్రజలు అభినందించారు. "అనారోగ్యంతోబాధపడుతున్న సమయంలో ఆర్థిక సహాయం అందడం మాకు ఎంతో ఊరటనిచ్చింది. మా పరిస్థితిని అర్థం చేసుకుని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందేలా చొరవ తీసుకున్న ఎమ్మెల్యే తాతయ్యకు కృతజ్ఞతలు" అని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి.. సమస్యలను తెలుసుకుని.. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరి గడపకు చేర్చే దిశగా ఎమ్మెల్యే తాతయ్య చేస్తున్న కృషికి ప్రజలు అభినందనలు తెలిపారు.

# ఏపీలోని గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్.

అమరావతి,నిర్భయవార్త ప్రతినిధి : ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకునే ప్రజలు, మండపాల నిర్వాహకులకు మద్దతుగా నిలిచేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన ట్వీట్ చేశారు. అంతేకాకుండా, రాబోయే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే దుర్గామాత మండపాలకు కూడా ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తామన్నారు. ప్రజలందరినీ ఆ గణేశుడు విజయాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు.





# అక్కినేని హీరో మూడేళ్లు ఎదురు చూపులు.. ఈ ఒక్క ఛాన్స్ గట్టిగా కొడతాడా?

టాలీవుడ్‌లో ప్రస్తుతం మైథలాజికల్ – డివైన్ కాన్సెప్ట్ చిత్రాలకు భారీగా డిమాండ్ పెరిగింది.టాలీవుడ్‌లో ప్రస్తుతం మైథలాజికల్ – డివైన్ కాన్సెప్ట్ చిత్రాలకు భారీగా డిమాండ్ పెరిగింది. ఈ ట్రెండ్‌లోనే అక్కినేని హీరో సుమంత్ తన తదుపరి చిత్రం –మహేంద్రగిరి వారాహి–తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. అయితే ఈ ప్రాజెక్ట్ వెనుక మూడేళ్ల సుదీర్ఘ నిరీక్షణ ఉందని సుమంత్ ఇటీవల వెల్లడించారు. కథ మూడేళ్ల క్రితమే ఓకే అయినా సరైన నిర్మాతలు దొరకకపోవడంతో ఏడాదిపాటు ఆగాల్సి వచ్చిందని.. ఆ తర్వాత మధు .. తదనంతరం దిల్ రాజు కాంబినేషన్‌లో పలు చిత్రాలకు పనిచేసిన లక్ష్మణ్ ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చారని తెలిపారు. ఫుటేజ్ నచ్చి లక్ష్మణ్ భాగస్వామి కావడం సినిమాపై నమ్మకాన్ని పెంచిందని సుమంత్ ఆనందం వ్యక్తం చేశారు. సుమంత్ సినీ ప్రయాణాన్ని గమనిస్తే.. అతడి కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన బంపర్ హిట్ చిత్రం –సత్యం–. ఆ సమయంలో మాస్– లవ్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా వచ్చి బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించింది. ఆ తర్వాత కొంత గ్యాప్ తీసుకుని హిందీ –విక్కీ డోనర్– రీమేక్‌గా –మళ్లీ రావా–, –సుబ్రహ్మణ్యపురం– వంటి విభిన్న కాన్సెప్ట్ చిత్రాలతో పాటు –గోదావరి– లాంటి క్లాసిక్స్ చేసినా కమర్షియల్‌గా బాక్సాఫీస్ వద్ద రూ. 50–100 కోట్ల రేంజ్ బిగ్గెస్ట్ మాస్ బ్లాక్‌బస్టర్ మాత్రం ఇంకా బకాయి పడే ఉందనే చెప్పాలి. లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు మనవడిగా.. అక్కినేని కాంపౌండ్ నుండి వచ్చిన సుమంత్ కెరీర్ ప్రారంభం నుండి ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొన్నారు. అయితే తన తాతగారు చూపించిన బాటలోనే ప్రతికూల పరిస్థితులను ప్రశాంతంగా ఎలా ఎదుర్కోవాలో నేర్చుకుని.. ఎంతో పరిణతితో తన కెరీర్ ఎంపికలను చేసుకుంటున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ లాంటి సొంత హోమ్ బ్యానర్ ఉన్నా.. నాగార్జున నేరుగా అవకాశాలు ఇవ్వగల వెసులుబాటు ఉన్నా... పరిశ్రమలో ––ఎవరికి వారే నిరూపించుకుని ఎదగాలి–– అనే సూత్రాన్ని సుమంత్ బలంగా నమ్ముతారు. స్వశక్తితో నిలబడాలనే నైజమే అతడిని నిర్మాత లక్ష్మణ్ లాంటి బయటి భాగస్వామ్యాల కోసం ఎదురుచూసేలా చేసింది.



చిత్రసీమలో ఒక్క సరైన విజయం పడితే రీ–ఎంట్రీ లేదా కంబ్యాక్ అనేది ఏ స్థాయిలో ఉంటుందో చెప్పడానికి హిందీ నటులు సన్నీ డియోల్ (గదర్ 2), బాబీ డియోల్ (యానిమల్) ఉదాహరణలుగా నిలిచారు. అవకాశాలు తగ్గిపోయి.. ట్రాక్ తప్పారనుకున్న సమయంలో ఒకే ఒక్క పవర్‌ఫుల్ బ్లాక్‌బస్టర్ వారి కెరీర్‌ను రికార్డు స్థాయిలో మార్చేసింది. ఇప్పుడు సుమంత్ కూడా సరిగ్గా అలాంటి ఒక సాలిడ్ కంబ్యాక్ కోసమే చూస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఎవరైనా నటుడు అన్ని అడ్డంకుల్ని అధిగమించి ముందుకు సాగాలంటే కథలతో, నటనా వైవిధ్యంతో.. విఫల ప్రయోగాలతో మాత్రమే ముందు సాగాల్సి ఉంటుంది. సుమంత్ ఇకపై అలాంటి ప్రయోగాలే చేస్తాడేమో చూడాలి. ప్రస్తుతం ప్రేక్షకులు కంటెంట్ ఉన్న డివైన్ థ్రిల్లర్స్.. మైథలాజికల్ డ్రామాలను ఆదరిస్తున్న

తరుణంలో –మహేంద్రగిరి వారాహి– సుమంత్ ఆశించిన ఆ పెద్ద కమర్షియల్ బ్రేక్ ఇస్తుందో లేదో వేచి చూడాలి. మూడేళ్ల శ్రమ, సరైన ప్రొడక్షన్ విలువలతో వస్తున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఏమేరకు రాణిస్తుందో .. అక్కినేని హీరోకి ఎలాంటి మైలేజ్ ఇస్తుందో థియేటర్లలోనే తేలనుంది.

## గుడ్ న్యూస్:

# రెండో బిడ్డతో 'రాకా- ప్రళయ్' బంపర్ హిట్లే!

బాలీవుడ్ మోస్ట్ క్రేజీ స్టార్ కపుల్ రణ్‌వీర్ సింగ్ – దీపికా పదుకొణే తమ అభిమానులకు.. చలనచిత్ర పరిశ్రమకు అద్భుతమైన తీపి కబురు అందించారు. బాలీవుడ్ మోస్ట్ క్రేజీ స్టార్ కపుల్ రణ్‌వీర్ సింగ్ – దీపికా పదుకొణే తమ అభిమానులకు.. చలనచిత్ర పరిశ్రమకు అద్భుతమైన తీపి కబురు అందించారు. తమ మొదటి కుమార్తె –దువా– జన్మించిన తర్వాత.. ఇప్పుడు తమ కుటుంబంలోకి రెండవ బిడ్డ రాబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. రణ్‌వీర్ సింగ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ––పాప దువా.. మా హృదయాలు మరింత పెద్దవిగా మారుతున్నాయి.. మీ దీవెనలకు ధన్యవాదాలు–– అని పోస్ట్ చేయడంతో ఈ గుడ్ న్యూస్ సోషల్ మీడియాలో నిమిషాల్లోనే విపరీతంగా వైరల్‌గా మారింది. సినీ విశ్లేషకులు– అభిమానుల నమ్మకం ప్రకారం.. ఈ జంట జీవితంలోకి బిడ్డల రాక వృత్తిపరంగా కూడా అపారమైన అదృష్టాన్ని తీసుకువస్తోంది. గతంలో కొన్ని వరుస పరాజయాలతో సతమతమైన రణ్‌వీర్ సింగ్‌కు.. కుమార్తె దువా జన్మించిన తర్వాత లక్ బాగా కలిసి వచ్చింది. అతడు నటించిన –ధురంధర్– ఫ్రాంచైజీ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తూ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది.



పాప రాకతో రణ్‌వీర్ మళ్లీ తిరిగి హిట్ ట్రాక్‌లోకి రావడమే కాకుండా.. తన తదుపరి భారీ ప్రాజెక్ట్ –ప్రళయ్–పై దృష్టి సారించడానికి మంచి ఎనర్జీ లభించింది. ఈ పాజిటివ్ వైబ్స్ ఇప్పుడు దీపికా పదుకొణే కెరీర్‌కు కూడా ఎంతగానో కలిసివస్తాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం దీపిక ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సరసన మోస్ట్ అవైటెడ్ పాన్–ఇండియా చిత్రం –రాకా–లో నటిస్తున్నారు. రెండో బిడ్డ రాకతో దక్కబోయే ఆనందం – అదృష్టం వల్ల దీపిక ఖాతాలో –రాకా– రూపంలో మరో బిగ్గెస్ట్ పాన్–ఇండియా విజయం నమోదు కావడం ఖాయమని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రణ్‌వీర్ నటిస్తున్న –ప్రళయ్– చిత్రం కూడా బాక్సాఫీస్ వద్ద ప్రళయం సృష్టించి బంపర్ హిట్ కొడుతుందని అంచనాలు వేస్తున్నారు.రణ్‌వీర్ దీనిని బ్రేక్ చేస్తాడా? రణ్‌వీర్ సింగ్ షేర్ చేసిన ఈ ఆనందకర పోస్ట్‌పై రంగుల ప్రపంచానికి చెందిన పలువురు అంతర్జాతీయ, జాతీయ ప్రముఖులు హృదయపూర్వక శుభాకాంక్షలు అందించారు. హాలీవుడ్ నటుడు విన్ డీజెల్, ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్, మీకా సింగ్, సారా అర్జున్, వరుణ్ ధావన్, సూర్యకుమార్ యాదవ్, కాజల్ అగర్వాల్, ఆయుష్మాన్ ఖురానా, రకుల్ ప్రీత్ సింగ్ వంటి ఎందరో సెలబ్రిటీలు ఈ జంటకు తమ బ్లెస్సింగ్స్ అందించారు. అక్క కాబోతున్న చిన్నారి దువాకు శ్రేయా ఘోషల్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలపడం విశేషం. ఎల్లప్పుడూ కష్టపడి పనిచేసే ఈ స్టార్ కపుల్ జీవితంలోకి రెండో బిడ్డ రాక ద్వారా వ్యక్తిగతంగానే కాకుండా.. సినిమాల పరంగా కూడా మరిన్ని విజయాలు దక్కాలని అభిమానులు మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారు. సోషల్ మీడియా కామెంట్లలో చిన్నారి దువా అచ్చం తండ్రి రణ్‌వీర్ సింగ్ లాగే ఉందని పోస్టులు పెడుతూ.. ఈ దిష్టి తగలని క్యూట్ ఫ్యామిలీకి అన్ని శుభాలే జరగాలని.. వారి తదుపరి చిత్రాలు –రాకా–, –ప్రళయ్–లు బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించాలని కోరుకుంటున్నారు.

# ఎపిక్.. మళ్లీ సెంటిమెంట్‌తో కొట్టిన విజయ్!



విజయ్ దేవరకొండ స్టేజ్ ఎక్కితే పెద్ద పెద్ద డైలాగ్స్ కంటే, నార్మల్‌గా మాట్లాడే మాటలే ఎక్కువగా జనాలకు చేరుతుంటాయి. విజయ్ దేవరకొండ స్టేజ్ ఎక్కితే పెద్ద పెద్ద డైలాగ్స్ కంటే, నార్మల్‌గా మాట్లాడే మాటలే ఎక్కువగా జనాలకు చేరుతుంటాయి. ఎపిక్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కూడా అదే జరిగింది. తమ్ముడు ఆనంద్ గురించి మాట్లాడుతూ చిన్నప్పుడు తాను ఏం చేసినా తన వెనకే వచ్చేవాడని గుర్తు చేసుకున్నాడు. కానీ ఇప్పుడు ఆనంద్ తనకంటూ ఒక దారి, ఒక ఫిల్మోగ్రఫీ తయారు చేసుకున్నాడని చెప్పాడు. అన్నగా చెప్పిన ఈ చిన్న మాటే స్పీచ్‌లో బాగా కనెక్ట్ అయింది. విజయ్ స్టార్ అయిన తర్వాత ఆనంద్ సినిమాల్లోకి వచ్చాడు. దీంతో మొదటి నుంచి విజయ్ తమ్ముడు అనే గుర్తింపు అతని వెంట ఉండటం సహజం. కానీ ఆనంద్ మాత్రం అదే ఇమేజ్ మీద కెరీర్ నడపలేదు. దొరసాని నుంచి బేబీ వరకు తనకు నచ్చిన కథలు చేసుకుంటూ వచ్చాడు. ఇప్పుడు ఎపిక్ కూడా అదే లైన్‌లో ఉంది. విజయ్ కూడా స్టేజ్ మీద తమ్ముడిని తనతో పోల్చకుండా, అతను ఎంచుకున్న దారినే మాట్లాడటం ఇక్కడ బాగుంది. విజయ్ స్పీచ్‌లు యువతకు త్వరగా కనెక్ట్ అవడానికి ఇదే ఒక కారణం. సినిమా ఈవెంట్ అంటే రాసుకొచ్చిన మాటలు, హీరోను పొగిడే లైన్స్ కాకుండా తన జీవితంలో జరిగిన చిన్న విషయాలను తీసుకొస్తాడు. ఫెయిల్యూర్స్ గురించి అయినా, కుటుంబం గురించి అయినా, కెరీర్ గురించి అయినా మాట్లాడే భాష చాలా క్యాజువల్‌గా ఉంటుంది. తన కెరీర్ గురించి చెప్పిన మరో మాట కూడా అదే టోన్‌లో వచ్చింది. తాను ఎంత పెద్ద స్థాయికి వెళ్తానన్నదానికంటే, తనను చూసి ఇంకొకరికి నేను కూడా చేయగలను అనే నమ్మకం వస్తే అదే ముఖ్యమని విజయ్ చెప్పాడు. అర్జున్ రెడ్డి టైమ్ నుంచి తనలో ఆ ఆలోచన ఉందని గుర్తు చేశాడు. ఇలాంటి లైన్స్‌లోనే విజయ్ స్పీచ్‌కు నేటి జనరేషన్‌తో ఉన్న కనెక్షన్ కనిపిస్తుంది. ఆదిత్య హాసన్ గురించి మాట్లాడినప్పుడు కూడా పర్సనల్ కనెక్షన్ నుంచే మొదలుపెట్టాడు. 90స్ చూడటానికి ప్రత్యేకం గా యాప్ సబ్‌స్క్రైబ్ చేసుకున్నా నని, అప్పుడే ఆదిత్య సినిమా వస్తే చూడాలని అనుకున్నానని చెప్పాడు. వైష్ణవి చైతన్య గురించి కూడా టాలెంటెడ్ నటి అంటూ చిన్నగా మాట్లాడాడు. ఎవరినీ అవసరానికి మించి పొగడకుండా, తనకు వాళ్లతో ఉన్న కనెక్షన్ ఏంటో చెప్పు కుంటూ వెళ్లా డు. అన్నదమ్ముల సినిమా ఈవెం ట్ అంటే క్రేజ్ మొత్తం స్టార్ బ్రదర్ తో హైలెట్ అయ్యే అవకాశం ఉంటుంది. కానీ ఈసారి ఆనంద్ గురించి మాట్లాడిన విధానం వేరుగా ఉంది. చిన్నప్పుడు తన వెనక తిరిగి న తమ్ముడు ఇప్పుడు తనకు నచ్చిన సినిమాలు ఎంచుకునే హీరో అ య్యాడని విజయ్ చెప్పడం, ఆన ందకు వచ్చిన మార్పును ఒక్క లైన్‌లో చెప్పేసి ంది. ఎపిక్ రిలీజ్ ప్రమోషన్స్‌లో ఈ అన్నదమ్ముల మాట మా త్రం బాగా హైలెట్ అం య్యింది. ఇక సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అం ం దుకు ంటుందో చూడాలి.

# త్రిష వ్యక్తిత్వాన్ని కించపరిచిన వారికి కంగన కోటింగ్!

కొంతకాలంగా తమిళనాడు రాజకీయాల్లో నటి త్రిష చుట్టూ ప్రకంపనాలు అన్నీ ఇన్నీ కావు. దళపతి విజయ్ స్నేహితురాలైన త్రిషను అడ్డుపెట్టుకుని టార్గెట్ చేయడం పెద్ద రచ్చకు కారణమవుతోంది.కొంతకాలంగా తమిళనాడు రాజకీయాల్లో నటి త్రిష చుట్టూ ప్రకంపనాలు అన్నీ ఇన్నీ కావు. దళపతి విజయ్ స్నేహితురాలైన త్రిషను అడ్డుపెట్టుకుని టార్గెట్ చేయడం పెద్ద రచ్చకు కారణమవుతోంది. ఇటీవల దళపతి ప్రత్యర్థి అయిన ఉదయనిధి స్టాలిన్ త్రిషను కించపరిచే కామెంట్లు చేయడంతో అది తమిళరాజకీయాల్లో రచ్చగా మారింది. తమిళనాడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నటి త్రిష వివాదం అంతకంతకు ముదురుతూనే ఉంది.



పలువురు సహనటీమణులు త్రిషకు మద్ధతు పలకగా, అటు బాలీవుడ్ నుంచి తనకు మద్ధతు పెరుగుతోంది. త్రిషకు మద్దతుగా బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ ఇప్పుడు వార్ లోకి వచ్చారు. –కుల్లు–లో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ– పర్యవేక్షణ కమిటీ (ఐ×ూనాూ) సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడిన కంగనా.. సమాజంలో విజయవంతమైన మహిళలపై సాగుతున్న ద్వంద్వ ప్రమాణాలను తీవ్రంగా ఖండించారు.పనిచేసే మహిళలు, విజయవంతమైన నటీమణులు లేదా రాజకీయనాయకుల క్యారెక్టర్‌ను టార్గెట్ చేస్తూ వారిని అణచివేసే సంస్కృతి కేవలం భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉందంటూ కంగనా ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం మహిళలను ఏ విధంగా చూస్తోందో ఎలా ప్రవర్తిస్తోందో లోతుగా ఆలోచించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. త్రిష పేరును నేరుగా ప్రస్తావించకుండానే తమిళనాడు ఘటనను ఉదాహరణగా చూపిస్తూ కంగనా మాట్లాడారు. ఇద్దరు వ్యక్తుల మధ్య ఎలాంటి సంబంధం లేదా వ్యవహారం ఉన్నప్పటికీ నిందలు వేయడం లేదా క్యారెక్టర్ అసాసినేషన్ (అవమానించడం) చేయడం విషయానికి వస్తే మాత్రం ఎల్లప్పుడూ మహిళనే ఎంచుకుని టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. ఈ వివాదం వెనుక డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ కావేరీ జలాల నిరసన సభలో చేసిన వ్యాఖ్యలు ప్రధాన కారణమయ్యాయి. సభలో జనాలు త్రిష పేరుతో నినదించగా ఉదయనిధి ద్వంద్వార్థాలు వచ్చేలా మాట్లాడారనే ఆరోపణలు వచ్చాయి. మహిళలను కించపరిచేలా ఉన్న ఈ వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు వ్యక్తమవ్వడమే కాకుండా ఉదయనిధి అరెస్ట్ వరకు పరిస్థితి దారితీసింది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పాలనలో ఆకట్టుకుంటూ ప్రత్యర్థులపై దూకుడు పెంచుతున్న తరుణంలో త్రిషతో ఉన్న బంధంపై రూమర్లు క్రియేట్ చేయడం.. ఆయన భార్య విడాకులకు దరఖాస్తు చేయడం వంటి అంశాలు ఈ వివాదానికి మరింత తోడయ్యాయి. ఈ క్రమంలో కంగనా స్పందిస్తూ రాజకీయ లేదా వ్యక్తిగత వైషమ్యాల కోసం మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం తగదని పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది.

# "రణబాలి" టీజర్ పైనే అందరి కళ్లు.. విజయ్ కంబ్యాక్ ఇస్తాడా?




టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ హీరోగా తన భార్య, నేషనల్ క్రష్ రష్మిక మందన్నా హీరోయిన్ గా దర్శకుడు రాహుల్ తెరకెక్కిస్తున్న భారీ పీరియాడిక్ సినిమా రణబాలి కోసం అందరికీ తెలిసిందే. విజయ్ కి గత సినిమా ఫ్లాప్ ఉన్నప్పటికీ దీనిపై మంచి అంచనాలు ఉన్నాయి. అయితే ఈ సినిమా నుంచి అవైటెడ్ టీజర్ ని మేకర్స్ నేడు విడుదల చేయడానికి సిద్ధం అయ్యారు.ఇక ఈ టీజర్ పైనే అందరి దృష్టి పడింది. విజయ్ ఈ సినిమాతో గట్టి కంబ్యాక్ ఇచ్చే కంటెంట్ ఇందులోనే కనిపిస్తుంది అని అంతా బలంగా నమ్ముతున్నారు. సో అదెలా ఉంటుందో తెలియాలి అంటే ఈ సాయంత్రం వరకు ఆగాల్సిందే. ఇక ఈ సినిమాకి అజయ్ అతుల్ లు సంగీతం అందిస్తున్నారు. అలాగే మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197